



# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 | సంచిక : 101 | పేజీలు : 8 | వెల : రూ.2/- శుక్రవారం 08 మే 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool







## సంపద సృష్టితోనే అభివృద్ధి సాధ్యం

- అభివృద్ధి లేకుంటే సంక్షేమం లేదు
- రిఫార్మ్స్, ఇన్నోవేషన్, డెలివరీ చాలా ముఖ్యం
- వారసత్వంగా రూ.9,74,000 కోట్లు అప్పు
- రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నాం
- కలెక్టర్ల సమిష్టి కృషితోనే సమస్యలకు పరిష్కారం
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

**అమరావతి,మన జనప్రగతి మే 07:**అభివృద్ధి లేకుంటే సంపద లేదని.. సంపద లేకుంటే సంక్షేమం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మనం అందించే సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ గురువారం సచివాలయంలో జరుగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. అధికారులు సమష్టిగా పనిచేసి.. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ప్రజాసమస్యలను వందశాతం పరిష్కరించాలని మార్గనిర్దేశర చేశారు. వారసత్వంగా రూ.9,74,000 కోట్లు అప్పుగా వచ్చాయని సీఎం చంద్రబాబు తెలిపారు. జగన్ హయాంలో కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన స్కీముల నుంచి రూ. 10వేల కోట్లు డైవర్ట్ చేశారని ధ్వజమెత్తారు. దీంతో వారు డబ్బులు ఇవ్వలేదని మిగతా2లో...

## దూసుకొస్తున్న ద్రోణి.. రెండు తెలుగు రాష్ట్రాలకు వర్షసూచన..!



**అమరావతి,మన జనప్రగతి మే 07:**భానుడి భగభగలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వాతావరణ మార్పులవల్ల గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి వాతావరణం చల్లబడే అవకాశం ఉందని తెలిపింది.ఇక తెలంగాణ విషయానికి వస్తే.. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాలవర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగవద్దని అధికారులు సూచించారు.ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ముఖ్యంగా రైతులు కోతకు వచ్చిన పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

## విశాఖ బీచ్‌రోడ్‌లో అల్లూరి స్ఫూర్తి యాత్ర

యాత్రలో పాల్గొన్న బిజెపి అధ్యక్షుడు మాధవ్



**విశాఖపట్నం,మన జనప్రగతి మే 07:** స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన విప్లవ నాయకుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో 'అల్లూరి స్ఫూర్తి యాత్ర' నిర్వహించారు. గురువారం ఉదయం విశాఖ బీచ్ రోడ్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి భారీ సంఖ్యలో కార్లు, బైక్‌లతో ర్యాలీని మిగతా2లో...

## ఏపీకి ఎవరు వస్తున్నారో తెలుసా..?

- లోకేశ్ ఆసక్తికర పోస్ట్



**అమరావతి,మన జనప్రగతి మే 07:** సోషల్ మీడియా ఎక్స్‌లో మంత్రి నారా లోకేశ్ ఓ ఆసక్తికర వీడియోను పోస్ట్ చేశారు. 'ఏపీకి ఎవరు వస్తున్నారో తెలుసా..?' అంటూ ఓ వీడియోను పోస్ట్ చేశారు. వీడియోను పోస్ట్ చేసిన లోకేశ్.. అందులో నీట్‌గా టక్ వేసుకుని, ట్రెండీ కళ్లజోడు పెట్టుకుని.. న్యూ లుక్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్(బు÷-లలెట్) డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నట్లు కనిపించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. మంత్రి లోకేశ్ లుక్‌ను పరిశీలించిన నెటిజన్లు ఏపీకి ఎవరు వస్తున్నారో కనిపెట్టేశారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు రాబోతున్నట్లు అంచనా వేశారు. బుధవారం నాడు ముఖ్యమంత్రి మిగతా2లో...

## ఒకే ప్లాట్ ఫాంపైకిరెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు

- వేగంగా డిజిటలైజేషన్ పక్రియ పూర్తి
- సిటిజెన్ ఫ్రెండ్లీగా రిజిస్ట్రేషన్ శాఖ
- కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి,మన జనప్రగతి మే 07:** రిజిస్ట్రేషన్ శాఖను సిటిజెన్ ఫ్రెండ్లీగా తయారు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు ఒకటే ప్లాట్ ఫాంపైకి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. డిజిటలైజేషన్ పక్రియను వేగంగా చేపడుతున్నామని చెప్పారు.బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అభినందనలు తెలియజేశారు. మిగతా2లో...

## నిజాయితీ, సేవాభావంతో పనిచేయండి

భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలి


ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు మంత్రి పొంగులేటి పిలుపు




**హైదరాబాద్,మన జనప్రగతి మే 07:** ఎంతో మంది మధ్య పోటీపడి, నిబద్ధతతో కష్టపడి సాధించిన గ్రూప్-1 డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు. వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలని, ముఖ్యంగా సమాజంలోని మిగతా2లో...

## తమిళనాడులో పొలిటికల్ థ్రిల్లర్.. ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్

● లిఖితపూర్వకంగా బలం చూపించాకే ప్రమాణ స్వీకారం ● 118 మంది ఎమ్మెల్యేల సంతకాలతో తిరిగి రండి ● అప్పటి వరకు వేరే ఎవరికీ అవకాశం ఇవ్వను ● విజయ్‌ను మళ్లీ తిప్పి పంపిన తమిళనాడు గవర్నర్ ఆర్లేకర్ ● విజయ్‌కు అవకాశం ఇవ్వాలన్న డీఎంకే, వీసీకే, వామపక్షాలు ● అన్నాడీఎంకేతో టీవీకే చర్చలు ● ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చేందుకు అంగీకారం



**చెన్నై, మన జనప్రగతి మే 07:** తమిళనాడు రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే ఆవిర్భవించినప్పటికీ అధికారం మాత్రం ఇంకా అందని ద్రాక్షలాగే మిగిలిపోయింది. రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ గురువారం వరుసగా రెండో రోజు కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న టీవీకే అధినేత విజయ్ ప్రతిపాదనను తిరస్కరించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విజయ్ గురువారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను మళ్లీ కలిశారు. అయితే 118 మంది ఎమ్మెల్యేల మద్దతు పొందిన తర్వాతే తిరిగి రావాలని గవర్నర్ ఆయనను కోరారని లోక్‌భవన్ వర్గాలు తెలిపాయి. టీవీకేకు ఇంకా అవసరమైన సంఖ్యాబలం తక్కువగా ఉందని, ప్రమాణ స్వీకార ప్రక్రియ జరగడానికి ముందు 118 మంది ఎమ్మెల్యేల సంతకాలతో తిరిగి రావాలని గవర్నర్ విజయ్‌కు చెప్పినట్లు మిగతా2లో...

## పదేళ్ల బిఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

- 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ
- బిఆర్ఎస్ నేతల విమర్శలు చూసి రైతులు నవ్వుకుంటున్నారు
- రైతులు ఆర్థానికి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి
- వరంగల్ రైతుమేళాలలో పాల్గొన్న మంత్రి తుమ్మల




**హనుమకొండ,మన జనప్రగతి మే 07:** బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లలోనే చేశారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మొదటి ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు మిగతా2లో...




## మహానాడు కన్వీనర్‌గా లోకేశ్

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08 -05-2026

# సంపద సృష్టితోనే అభివృద్ధి సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. రూ.1,30000 వేల కోట్లు అప్పులు చెల్లించకుండా ఉంచేశారని మండిపడ్డారు. ఏపీని పునఃనిర్మిస్తామని తాను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చామని ప్రస్తావించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. రిఫార్మ్, ఇన్నోవేషన్, డెలివరీ అనేది చాలా ముఖ్యమని చెప్పుకొచ్చారు. అందరి సహకారంతో రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వచ్చిందని.. ఇది సమష్టి విజయమని ఉద్ఘాటించారు. ఈ అవార్డు తనకు బాధ్యతతో కూడినది అని.. నిజానికి ఇలాంటి అవార్డులు పాజిటివ్ మూడ్ క్రియేట్ చేస్తాయని వ్యాఖ్యానించారు. మీ అందరి సహకారంతోనే తనకు ఈ అవార్డు వచ్చిందని అన్నారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడారని? ఇప్పుడు ఏం మాట్లాడుకుంటున్నారనే దానికి ఈ అవార్డు ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. మంత్రులు, సీఎస్ మొదలుకుని... గ్రామస్థాయి అధికారి వరకు పనిచేయడం వల్లే ఈ అవార్డు దక్కిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడులను ఏపీకి తీసుకురాగలిగామని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. గ్రీన్ఎనర్జీ, డేటా సెంటర్ పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు రూ.23లక్షల కోట్ల ఎంవోయూలు పూర్తి చేశామని తెలిపారు. ఇప్పటికే జరిగిన ఎంవోయూల ద్వారా 24లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. దేశంలోని అతిపెద్ద కంపెనీలన్నీ ఏపీలో ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. వారానికో కంపెనీ తీసుకొస్తున్నామని.. రోజుకో శంకుస్థాపన చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు రెండు జిల్లాల నుంచి కొత్తగా కలెక్టర్లు వచ్చారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజల మ్యాండేట్ నిన్న కూడా చూశామని... సరిగా పనిచేయకపోతే ప్రజలు ఆదరించరని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యం కారణంగా ఈ సమావేశానికి రాలేకపో యారని... తాము ఇద్దరం కలిసి ఇచ్చిన హామీలు నేరవేర్చాల్సి ఉంటుందని చెప్పారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లు ఏపీలో ఏమాత్రం అభివృద్ధి లేకపోయినా ఇప్పుడు చాలా వరకూ ట్రాక్‌లో పెట్టగలిగామని అన్నారు. ఆర్థిక అసమానతలు పరిష్కరించి జీవన ప్రమాణాలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల కలయికే కూటమి ప్రభుత్వమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. గతంలో డెలివరీ లీకేజిలు ఎక్కువగా ఉండేవని... ఇప్పుడు డీబీటీ ద్వారా నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకి నిధులు వెళ్తున్నాయని వివరించారు. జగన్ హయాంలో ఏపీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రోడ్ల అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పుకొ చ్చారు. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు కలెక్టర్ రిపోర్టు పంపేవారని.. అయితే వారు ఇప్పుడు పంపక్కరలేదని... తామే పంపిస్తామని అన్నారు. ప్రజా సమస్యలు అన్నింటిని పాజిటివ్‌గా పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవస్థను మ్యానేజ్ చేయడానికి కాదని.. దాన్ని మార్చడానికి ఈ ప్రభుత్వం ఉందని తెలిపారు. డబ్బు లేదనేది నిజం కాదని... డబ్బును సృష్టించి పనులు చేయించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సదస్సులో మంత్రులు, సిఎస్ , డిజిపి తదితరు అధికారులు పాల్గొన్నారు.

# తమిళనాడులో పొలిటికల్ థ్రిల్లర్.. ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్

(మొదటి పేజీ తరువాయి)

ఆ వర్గాలు తెలిపాయి.దయచేసి 118 సంతకాలతో రండి. టీవీకేకు మెజారిటీ ఉందని నిరూపించండి. అప్పుడు ప్రమాణ స్వీకారం జరుగుతుంది అని గవర్నర్ విజయ్‌తో చెప్పినట్లు తెలిసింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థిరంగా ఉండి, కూలిపోకుండా ఉండేందుకే గవర్నర్ లిఖితపూర్వక మద్దతుపై పట్టుబట్టారని ఆ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏ ఇతర పార్టీని ఆహ్వానించబోమని గవర్నర్ విజయ్‌కు హామీ ఇచ్చారని కూడా తెలిపాయి. తమ సంఖ్యా బలానికి మద్దతుగా సంతకాలతో తిరిగి రావాలని టీవీకేను గవర్నర్ కోరారు. ఆ తర్వాత విజయ్ ప్రమాణ స్వీకారం చేస్తారు. ఏఐఏడీఎంకే నాయకుడు ఎడప్పాడి కే పళనిస్వామి గవర్నర్‌తో ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని సంబంధిత వర్గాలు చెప్పాయి.ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం మే 9న ముగియనున్నందున కొత్త ప్రభుత్వంపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్ అర్లేకర్‌కు మరి కొన్ని రోజుల వ్యవధి ఉంది. ముందు రోజు కూడా విజయ్ 112 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్‌ను కలిశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ నుంచి విజయ్ మద్దతు పొందినప్పటికీ విజయ్ తనకు పార్టీ అండ ఉందని గవర్నర్‌కు మౌఖికంగా తెలియచేసి సంఖ్యాబలాన్ని మరింత పెంచుకోవడానికి మరికొంత సమయం కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అయితే ఈ సంఖ్య సరిపోదని విజయ్‌కు తెలియచేసిన గవర్నర్ 118 మంది ఎమ్మెల్యేల మద్దతుతో తిరిగి రావాలని కోరినట్లు తెలిసింది. దీంతో మళ్లీ కొత్త యత్నాలకు ఇది నాంది పలుకుతున్నది.

**విజయ్‌కు అవకాశం ఇవ్వండి** విడుతలై చిరుతైరళ్ కచ్చి(వీసీకే) అధినేత తొల్ తిరుమవళవన్ గురువారం గవర్నర్ అర్లేకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు విజయ్‌ను ఆహ్వానించి సభలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. తమిళనాడు రాజకీయాల్లోకి బీజేపీ చొరబడి గందరగోళాన్ని సృష్టిస్తున్నదని స్థానిక మీడియాతో మాట్లాడుతూ తిరుమవళవన్ ఆరోపించారు. ఏకైక అతిపెద్ద పార్టీ నాయకుడిగా ఉన్న విజయ్‌ను పదవీ బాధ్యతలు చేపట్టేందుకు, ఆ తర్వాత అసెంబ్లీలో మెజారిటీని నిరూపించుకునేందుకు అనుమతించాలని ఆయన కోరారు. ఇప్పుడు బీజేపీ లేదా అమిత్ షా, మోదీ తమిళనాడు రాజకీయాల్లో జోక్యం చేసుకుని గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. టీవీకేని ఏకైక అతిపెద్ద పార్టీగా ప్రజలు ఎంచుకున్నారు.అందువల్ల ఆయనను పదవీ బాధ్యతలు చేపట్టడానికి అనుమతించాలి. రాజ్యాంగం కూడా అదే నిర్దేశిస్తున్నది అని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించకపోవడాన్ని తీవ్రంగా విమర్శించిన ఎంఎన్ఎం నేత కమల్ హాసన్ ఇది తమిళనాడు ప్రజలు ఇచ్చిన తీర్పును అగౌరవపర్చడం, అవమానపర్చడమేనని అన్నారు. డీఎంకే నేత ఏ శరవణన్ కూడా విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఎన్నికల ముందు ఎలాంటి పొత్తులు పెట్టుకోకుండా అతి పెద్ద పార్టీగా నిలిచిన టీవీకేను ఆహ్వానించడం సముచితమని అన్నారు.

# పదేళ్ల బిఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

(మొదటి పేజీ తరువాయి)

రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశారని చెప్పారు. రైతులందరూ ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. రసాయనాల వాడకాన్ని తగ్గించకపోతే వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. గురువారం హనుమకొండలో జరిగిన రైతుమేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి రైతు మేళాలో తుమ్మల పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలు వరంగల్ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై చౌవకబారు వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై కేటీఆర్ అండ్ కో అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఎగ్గొడితే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చారని ప్రస్తావించారు. యుద్ధం వల్ల యూరియా ఆగిపోయినా మన రైతులకు యూరియా అందించామని మంత్రి తుమ్మల తెలిపారు. యూరియాపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా రూ.లక్షకోట్లను రైతుల కోసం ఖర్చుపెట్టామని తెలిపారు. కేసీఆర్ హయాంలోని అవినీతి, అహంకారాన్ని రైతులు ఎప్పటికీ మరచిపోరని చెప్పుకొచ్చారు. కాకతీయుల గడ్డపై కేటీఆర్, తదితరులు చేసిన ప్రసంగాన్ని ప్రజలంతా అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. మొక్కజొన్నలు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ధాన్యం, మొక్కజొన్నలు వీలైనంత త్వరగా కొనుగోలు చేయాలని వేదికపైనే కలెక్టర్లను ఆదేశిస్తున్నానని అన్నారు. దేశంలో రైతులకు యూరియా అందించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తుమ్మల తెలిపారు. రైతులకు సంబంధించిన అంశంలో వెనకడుగు వేయబోమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కొంతమంది తనను అవమాన పరచాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అన్నదాతలు పంట మార్పిడి చేయాలని, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశర చేశారు. రైతుల ఖాతాల్లో కాంగ్రెస్ సర్కార్ రూ.21 వేల కోట్లను జమ చేసింది. రూ.లక్ష రుణమా ఫీని కేసీఆర్ పదేళ్లలో ఏనాడూ పూర్తి చేయలేదు. రుణ మాఫీకి బీఆర్ఎస్ ఐదేళ్ల సమయం తీసుకోవడంతో.. వాళ్లిచ్చింది వడ్డీలకు కూడా సరిపోలేదు. ఒక్క రైతుబం ధు ఇచ్చి.. మిగతా పథకాలన్నింటినీ నిలిపివేశారు. బీఆర్ఎస్ అహంకార వైఖరిని ప్రజలు ఇంకా మర్చిపోలేదు. మళ్లీ ఆ పార్టీకి అధికారం ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరు. ఇవాళ రైతులకు అప్పులు తక్కువున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుందని తుమ్మల తెలిపారు.

# గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

## బిజెపి కార్యకర్తల గుండాల్లో దాడులు చేయడమేంటి..?

## మండిపడ్డ కెటిఆర్ ,హరీష్ రావులు





**హైదరాబాద్,మన జనప్రగతి మే 07:** కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దాడులను తీవ్రంగా ఖండించారు. పట్టపగలు గూండాల్లా వచ్చి వాహనాలు, ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొల్పుతున్నారంటూ బండి సంజయ్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. 'ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి జరిగిన వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో మాట్లాడాం. పట్టపగలు గుండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలను, ఆఫీసును ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. కళ్లముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌కు బీ-టీంగా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొలుపుతున్నారు. ప్రతిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు కుప్పిగంతులు వేయడం తప్ప కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ చేసిందేమీ లేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతోనే శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యా న్ని అపహాస్యం చేయడమే. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బండి సంజయ్ అను చరుల దాడిని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ పట్టణంలో బీజేపీ గుండాలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేసి కిటికీల అద్దాలు పగులగొట్టారని తెలిసిందే. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు.కేటీఆర్ ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి నాయకులు, కార్య కర్తల యోగక్షేమాల అడిగి తెలుసుకున్నారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విశాఖ బీచ్‌రోడ్‌లో అల్లూరి స్ఫూర్తి యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. అల్లూరి విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ యాత్ర ఆయన జీవితం, పోరాటం సంబంధిత ప్రాంతాల మీదుగా సాగింది. బ్రిటిష్ వారు అల్లూరి సీతారామరాజును బంధించిన మంప గ్రామం మీదుగా, ఆయనను కిరాతకంగా కాల్చి చంపిన రాజేంద్రపాలెం ప్రాంతాన్ని బీజేపీ నేతలు సందర్శించనున్నారు. అక్కడ నుంచి అల్లూరిని ఆంగ్లేయులు సమాధి చేసిన కె.డి.పేట చేరుకొని ఘన నివాళులు అర్పించనున్నారు.

# ఏపీకి ఎవరు వస్తున్నారో తెలుసా..?

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) సమావేశంలో భారీగా పెట్టుబడులకు ఆమోదముద్ర వేసింది. అందులో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ రూ.2,500 కోట్లతో మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఈ క్రమంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ఏపీకి రాబోతోందంటూ ఇన్‌డైరెక్ట్‌గా ఎక్స్‌లో మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది.

# ఒకే ప్లాట్ ఫాంపైకిరెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరుగుతున్న 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంత్రి ప్రసంగిస్తూ.. రాష్ట్రాన్ని గత పాలకులు విధ్వంసం చేసినా.. పునర్నిర్మించుకుంటున్నామని తెలిపారు. భూ సంబంధిత అంశాల్లో సంస్కరణలు తీసుకువచ్చామని.. అడంగళ్లు, పాస్ పుస్తకాలు వేగంగా అందిస్తున్నామని చెప్పారు. 1.37 లక్షల ఎకరాలు 22ఏ నుంచి తొలగించామని మంత్రి వివరించారు. రీసర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రం నుంచి సింగపూర్ దేశానికి అధ్యయనం కోసం వెళ్లామని.. పాలనాపరమైన అంశాలను చాలా నేర్చుకున్నామని అన్నారు. సింగపూర్ దేశంలో ప్రెసిషన్, ఇంటిగ్రేషన్, సైన్స్‌ను పాలనలో ఇంటిగ్రేట్ చేశారన్నారు. గవర్నెన్సు అంటే టీమ్ వర్క్‌గా పని చేస్తున్న విధానం సింగపూర్‌లో ఉందని... ఏపీలోనూ ఇదే అంశాన్ని సీఎం పదేపదే చెబుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను రీ-ఫోకస్ చేసేందుకు కలెక్టర్ల కాన్సరెన్స్ ఉపకరిస్తోందని సీఎస్ సాయిప్రసాద్ అన్నారు. సుపరిపాలనతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నది ప్రభుత్వ విధానమని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు- సర్వీస్ డెలివరీ అనేది అత్యంత కీలకమైన అంశమని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి నిర్దేశిరచిన 10 సూత్రాల ఆధారంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారమవుతుందన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయగలమని తెలిపారు. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తేనే అభివృద్ధి, స్వయం సమృద్ధి సాధించగలమన్నారు. విద్య, వైద్యం లాంటి సంక్షేమ కార్యక్రమాలను సమర్ధంగా ప్రజలకు అందించాలన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్తూ నిర్ణయాలు తీసుకోవటంలో ఎలాంటి సంకోచం ఉండకూడదని సీఎస్ సాయి ప్రసాద్ పేర్కొన్నారు.

# నిజాయితీ, సేవాభావంతో పనిచేయండి

(మొదటి పేజీ తరువాయి)

'ఫూరెస్ట్ ఆఫ్ ది పూర్' కు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలవాలని ఉద్బోధించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించాల్సిన కీలక బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఛాలెంజ్‌గా స్వీకరించి ముందుకు సాగితే కలిగే సంతృప్తి అమూల్యమని అన్నారు.దర్పవంతమైన సేవలతో భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని యువ అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు కన్వీనర్‌గా లోకేశ్



**అమరావతి,మన జనప్రగతి మే 07:** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్ వేదికగా టీడీపీ మహానాడు- 2026 ను నిర్వహించనున్నారు. ఈ మహానాడు నిర్వహణకు వివిధ కమిటీలను పార్టీ హైకమాండ్ నియమించింది. మొత్తం 21 కమిటీలను నియమించింది. సమన్వయ కమిటీ కన్వీనర్‌గా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ నియమించింది. ఈ మహానాడు మే 27న ప్రారంభమై.. 29వ తేదీతో ముగియనుంది.ఈ మహానాడు నిర్వహణ కోసం మే 6వ తేదీన ఇఫ్కో కిసాన్ సెజ్‌లో భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు, మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మొదటి రెండు రోజులు 20 వేల మంది డెలిగేట్స్ ఈ మహానాడుకు వస్తారని.. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ ముగింపు సభకు దాదాపు ఏడు లక్షలకు పైగా కార్యకర్తలు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు.

# తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

## • ఏకసభ్య కమిషన్ నివేదికపై కమిటీ

**అమరావతి,మన జనప్రగతి మే 07:**తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారంపై ఏకసభ్య కమిషన్ నివేదికపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ జీవో నంబర్ 900ను జారీ చేశారు. ఏకసభ్య కమిషన్ నివేదికలో బయటపడిన అంశాలు, సిఫార్సులను వివరంగా అధ్యయనం చేయాలని ఆదేశించింది. పాలనాపరంగా అధికారులపై తీసుకోవాల్సిన క్రమశిక్షణ చర్యలు, న్యాయపరంగా ముందుకు వెళ్లాల్సిన అంశాలపై సూచనలు చేయాలని కమిటీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏకసభ్య కమిషన్ నివేదికలోని నిర్ణీత కాల వ్యవధిలో అమలు చేయాల్సిన అంశాలను సూచించాలని ప్రభుత్వం తెలిపింది. ఈ సిఫార్సులను అమలు చేసేందుకు తగిన పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటు చేయడం వంటి అంశాలపై కమిటీ సూచనలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కమిటీ తన నివేదికను వారం రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించాలని జీవోలో స్పష్టంగా సూచించింది.

# సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన జాయింట్ కలెక్టర్



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 07:-** సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష 2026 ఉత్తమ మార్కులు సాధించిన వారిని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అభినందించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష 2026 ఉత్తమ మార్కులు సాధించిన వారిని జాయింట్ కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి దేశ సేవలో భాగస్వామ్యం కావాలని కోరారు. కఠినమైన క్రమశిక్షణ, పట్టుదలతో చదివి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు.. సైనిక్ స్కూళ్లలో లభించే శిక్షణను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో దేశ రక్షణలో కీలక పాత్ర పోషించాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లాలోని మరింత మంది విద్యార్థులు ఇలాంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చేరేందుకు ఈ విజయం స్ఫూర్తిగా నిలుస్తుందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.

# మహిళలకు అవగాహన సదస్సు విజయవంతం





**దేవనకొండ మన జనప్రగతి మే 07:-**దేవనకొండ మండలంలో నిర్వహించిన మహిళా అవగాహన సదస్సు విజయవంతంగా ముగిసింది. మహిళల భద్రత, హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐ వేణుగోపాల్ తదితర పోలీస్ అధికారులు మహిళలకు చట్టపరమైన హక్కులు, మహిళా రక్షణకు ఉన్న న్యాయ పరిరక్షణలు గురించి వివరించారు. అలాగే పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ఆన్‌లైన్ మోసాల నుండి ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. మహిళలు స్వయం రక్షణకు అవసరమైన మెళకువలను కూడా ప్రదర్శనల ద్వారా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ధైర్యంగా ఎదుర్కొనే విధానాలపై సూచనలు అందించారు. మహిళా భద్రత దిశగా అవగాహన పెంపొందించడంలో ఈ సదస్సు కీలకంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమం అంతటా మహిళల నుంచి మంచి స్పందన లభించింది.

# వేములలో చెరువు కట్ట వద్ద దారుణం.. గుర్తుతెలియని వాహనం 'ఢీ' కొని ఒకరి మృతి..!

- మరొకరి పరిస్థితి విషమం
- బైక్‌ను ఢీకొని పరారైన వాహనం
- పోలీసులు దర్యాప్తు కొనసాగింపు





**వేముల మన జనప్రగతి మే 07:-**కడప - పులివెందుల ప్రధాన రహదారిలోని వేముల గ్రామ సమీపంలో గల చెరువు కట్ట వద్ద గురువారం ఉదయం జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల ప్రకారం వేంపల్లి మండలం టి.వెలమారిపల్లె గ్రామానికి చెందిన జైపాల్ రెడ్డి (60), గంగన్న యాదవ్ ఇద్దరూ బైక్‌పై పులివెందులలో జరుగుతున్న శుభకార్యానికి వెళ్తుండగా వేముల చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి అధిక వేగంతో వచ్చిన గుర్తుతెలియని వాహనం వారి బైక్‌ను ఢీకొట్టి అక్కడి నుంచి పరారైంది. ఢీకొన్న ప్రభావంతో ఇద్దరూ రోడ్డుపై పడిపడి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను పులివెందులలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జైపాల్ రెడ్డి మృతి చెందగా, గంగన్న యాదవ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. జైపాల్ రెడ్డి మృతితో వెలమారిపల్లె గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.


# విద్యుత్ లైన్ మార్పుతో కొత్త షెడ్యూల్

- వేముల మండల ఏఈ శ్రీనివాసులు
- గొందిపల్లెకు లైన్ మార్పు - రైతులకు సూచనలు




**వేముల మన జనప్రగతి మే 07:-**వేముల మండల కేంద్రంలోని స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న రైతులకు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు గురువారం విజ్ఞప్తి చేశారు. శేషన్నగారిపల్లె పీడర్ లైన్‌ను ఈరోజు (07-05-2026) నుంచి గొందిపల్లె పీడర్‌కు మార్చినట్లు తెలిపారు. ఈ మార్పు ఈనాడు రమణారెడ్డి తోట, శేషన్నగారిపల్లె గ్రామం పొలాలు, వేముల ఎస్సీ కాలనీ, శేషన్నగారిపల్లి కాలువ పరిసరాలు, ఎరువుల అంగడి సోము తోటలు, చందా రమేష్ తోట, కాలువ వద్ద గల పేర్ల శ్రీరామిరెడ్డి తోట, పేర్ల పార్థసారథి రెడ్డి తోటలు, వేముల హాస్టల్ పరిసరాలు, సుశీలమ్మ తోట నుంచి పుల్లారెడ్డి పెట్రోల్ బంక్ వరకు వర్తిస్తుందని వివరించారు. పీడర్ మార్పు కారణంగా విద్యుత్ సరఫరాలో మార్పులు ఉండే అవకాశమున్నందున రైతులు సప్లై సమయాలు తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ శ్రీనివాసులు సూచించారు.

# అశ్వ వాహనంపై నృసింహస్వామి వైభవం







- ఉరవకొండలో కన్నులపండువగా బ్రహ్మోత్సవాలు

**ఉరవకొండ మన జనప్రగతి మే 07:-** స్థానిక సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. **భక్తి పారవశ్యంలో మాడవీధులు** గురువారం ఉదయం నుంచే ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, అభిషేక పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం పల్లకిలో ఉంచి ప్రత్యేక ప్రతిష్టాపన పూజలు నిర్వహించారు. 'నమో నారసింహ' స్మరణల మధ్య స్వామివారు నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి మంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంతో పులకించిపోయారు. **పాల్గొన్న ప్రముఖులు** ఈ వేడుకలో ఆలయ ఈఓ సాకే రమేష్ బాబు ప్రధాన అర్చకులు ద్వారకనాథశాస్త్రి మయూరం బాలాజీ, గుండురావు పాల్గొన్నారు. ఉభయదాతలు అంగదాల నారాయణస్వామి, అంగదాల ఆంజనేయులు, అంగదాల అభినయ, గాజుల నాగరాజుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. **నేటి కార్యక్రమాలు:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం (మే 8) ఆలయంలో కింది విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు

# మండల అధ్యక్షుడు శంకర్ బాబు ఆధ్వర్యంలో అల్లూరి,ఠాగూర్‌కు ఘన నివాళి



**పత్తికొండ మన జనప్రగతి మే 07:-**మద్దికేర మండలంలో మండల అధ్యక్షుడు శంకర్ బాబు ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ జాతీయ నాయకులు రవీంద్రనాథ్ ఠాగూర్ మరియు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళు లర్పించారు. దేశభక్తి, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత జాతీయ గీతం "జనగణమన" రచించిన ఠాగూర్ దేశానికి అందించిన సేవలు అపారమని కొనియాడారు. అలాగే బ్రిటిష్ పాలనను సవాలు చేసి గిరిజనుల హక్కుల కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు త్యాగాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, "మన ఊరు మన జెండా" జిల్లా కో-కన్వీనర్ డాక్టర్ రామ్మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జి. శ్రీనివాసులు, మాజీ సైనికుడు గోపాల్, కసాపురం ఎర్రిస్వామి, బంగి రాముడు, సురేష్, ఈడుగ బాలకృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. మద్దికేర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తుమ్మలపల్లి యూసిఐఎల్‌లో శుద్ధి కేంద్రం ప్రారంభం

- ఎన్విరాన్మెంట్ ఇంజనీరింగ్ అధికార కురువ సుధా చేతుల మీదుగా ప్రారంభం
- నీటి పునర్వినియోగానికి అవకాశం






**వేముల మన జనప్రగతి మే 07:-**వేముల మండల పరిధిలోని స్థానిక తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసిఐఎల్) యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్మించిన మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని (స్యూవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) గురువారం ఘనంగా ప్రారంభించారు. కడప ఎన్విరాన్మెంట్ ఇంజనీరింగ్ అధికారి కురువ సుధా ముఖ్య అతిథిగా పాల్గొని ఈ కర్మాగారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిశ్రమల వద్ద పర్యావరణ పరిరక్షణకు శుద్ధి కర్మాగారాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఇటువంటి ఆధునిక శుద్ధి కేంద్రాలు కాలుష్య నియంత్రణలో ముఖ్య పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు. యూసిఐఎల్ జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్, డీజీఎం (జియాలజిస్ట్) కె.ఎస్ విజయ్ కుమార్, మైన్ డీజీఎం కిషోర్ భగత్, సిఎస్ఆర్ విభాగం డాక్టర్ నవీన్ రెడ్డి, ప్రభాస్ రంజన్, ఎల్ రాజేష్‌లు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అధికారులు కర్మాగారాన్ని పరిశీలించి దాని పనితీరును సమీక్షించారు.

# ఉద్దేహాల్ ఆర్‌డీటీ కాలనీలో వడదెబ్బపై అవగాహన




**బొమ్మనహల్ మన జనప్రగతి మే 07:-**మండల పరిధిలోని ఉద్దేహాల్ ఆర్‌డీటీ కాలనీలో ప్రజలకు వడదెబ్బనివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటిద్దాం..వడదెబ్బ వల్ల సంభవించే మరణాలను అరికడుదాం"అనే నినాదంతో ప్రజలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో తరచుగా నీరు తాగడం, పళ్లరసాలు, ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రావణాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. పొలం పనులకు వెళ్లేవారు తలకు రుమాలు, టోపీ, గొడుగు వంటివి ఉపయోగించడంతో పాటు వదులుగా ఉండే నూలు దుస్తులు ధరించాలని సూచించారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించి, దుస్తులు వదులుగా చేసి గాలి వచ్చేలా చూడాలని, పరిస్థితి విషమిస్తే సమీప ఆసుపత్రికి తరలించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన్, శారద, ఆశా కార్యకర్తలు కె.లక్ష్మి, హెచ్.లక్ష్మి మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఉచిత విద్యుత్ అమలుతో నేతన్నల హర్షం

## - టీడీపీతోనే న్యాయం జరుగుతుందన్న పుత్తా బాబు



**సిద్దవటం మన జనప్రగతి మే 07:-**మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీ సాయినగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నేత పుత్తా బాబు మాట్లాడుతూ, చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షించదగ్గదని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చేనేత కుటుంబాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఏటా నేతన్నకు రూ. 25 వేల ఆర్థిక సాయం అందించే కొత్త పథకాన్ని ప్రభుత్వం రూపొందిస్తోందని వెల్లడించారు. గురువారం గ్రామంలో ఉచిత విద్యుత్ వర్తించిన కార్మికులు కరెంటు బిల్లులు చూపిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు చేనేత కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08 -05-2026

# ఉపాధి హామీ కూలీలకు తక్కువ వేతనం..

**• న్యాయం చేయాలని కూలీల డిమాండ్..!**



**సిద్ధవటం మన జనప్రగతి మే 07:-** మండలంలోని టక్కోలి గ్రామం ఎర్ర చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు తమకు వస్తున్న తక్కువ వేతనంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేక నేల గట్టిగా ఉండటంతో కష్టపడి పనిచేసినా, రోజుకు కేవలం 150 మాత్రమే పడుతోందని వారు వాపోతున్నారు. ఇతర పనులకు వెళ్తే ఇంతకంటే మెరుగైన కూలీ లభిస్తుందని, అధికారులు స్పందించి కొలతల ప్రకారం తమకు న్యాయమైన వేతనం అందేలా చూడాలని కోరారు. ఈ విషయంపై ఏపీవో నరసింహులు స్పందిస్తూ.. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేస్తేనే పూర్తిస్థాయి కూలీ డబ్బులు జమవుతాయని స్పష్టం చేశారు. కేటాయించిన ప్రదేశాల్లో నిబంధనల మేరకు పనులు చేయాలని ఆయన సూచించారు.

# ప్రాణ సంకటంగా మారిన విద్యుత్ తీగలు

**• సిద్ధవటం రైతుల ఆవేదన**



**సిద్ధవటం మన జనప్రగతి మే 07:-**మండల కేంద్రం శివారులోని పంట పొలాల్లో విద్యుత్ తీగలు భూమికి అతి సమీపంలో వేలాడుతుండటంతో రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఒక విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయి తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయని, దీనివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతులు మండిపడుతున్నారు.ఈ విషయమై విద్యుత్ ఏఈ జయచంద్ర స్పందిస్తూ.. సమస్యను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించామని, దెబ్బతిన్న స్తంభాన్ని మార్చి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ప్రొద్దుటూరులో ట్రాఫిక్‌కు చెక్..!

**• ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సమీక్ష సమావేశం**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 07:-** ప్రొద్దుటూరు పురపాలక కార్యాలయంలో ట్రాఫిక్ నియంత్రణపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం, పాల్గొన్న ఏ ఎస్ పి విభూకృష్ణ ఐపీఎస్. ప్రధాన రహదారులలో ఉండే షాపింగ్ కాంప్లెక్స్ ల నందు ద్విచక్ర వాహనాల పార్కింగ్ కొరకు చర్యలు చేపట్టడం, వ్యాపారాలకు వచ్చే వ్యాపారస్తులు దుకాణాల బయట వాహనాల పార్కింగ్ అదుపు చేయడం, ప్రధాన గాంధీరోడ్డులోని ఆసుపత్రుల ప్రాంతాలలో ఆటోలు, బైక్ లు పార్కింగ్ చేయకుండా అదుపు చేయడం, శ్రీరాములపేట హోమస్ పేట రోడ్డు మధ్యలో ద్విచక్ర వాహనాల పార్కింగ్ అదుపు చేయుట, వాహనదారులు రోడ్లకు అడ్డంగా పార్కింగ్ చేయకుండా పోలీస్ వారు మైకులలో అనౌన్స్ చేసి అవగాహనా కల్పించుట, సమీక్షా సమావేశంలో పురపాలక కమిషనర్ రవిచంద్రారెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సురేష్ రెడ్డి, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వియస్ ముక్తియార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి,రాజుపాలెం మాజీ జెడ్పిటిసి తోట మహేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు నల్లబోతుల నాగరాజు,బేపారి జాకీర్ అహ్మమ్మద్,నాయకులు బచ్చల వీరప్రతాప్,ఘంటశాల వెంకటేశ్వర్లు,ఖాలీల్,మున్నా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు కొత్త దిశ రాజీవ్ గాంధీ కళాశాల కీలక నిర్ణయం

**• స్మార్ట్ బ్రిడ్జ్‌తో ఒప్పందం ద్వారా ప్లేస్‌మెంట్ అవకాశాలు**

**• డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్‌పై ఫోకస్**

**• 202627 నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు ప్రారంభం**




**కాకినాడ మన జనప్రగతి మే 07:-**జిల్లాలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో ఒకటైన రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ బ్రిడ్జ్ సంస్థతో ముఖ్యమైన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించడంతో పాటు ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.స్మార్ట్ బ్రిడ్జ్ సంస్థకు గూగుల్, మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, ఎన్విడియా వంటి ప్రముఖ అంతర్జాతీయ సంస్థలతో అనుబంధాలు ఉండటంతో, విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించబడనుంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి కోర్సుల్లో టెక్నికల్ స్కిల్స్ అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.ఇంకా, 202627 విద్యా సంవత్సరంనుంచి డిగ్రీ కోర్సుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ప్రవేశపెట్టాలని కళాశాల యాజమాన్యం నిర్ణయించింది. విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయడమే తమ ముఖ్య ఉద్దేశమని కళాశాల ప్రిన్సిపల్ రవికాంత్ తెలిపారు.ఈ ఒప్పందాన్ని విజయవంతం చేయడంలో కళాశాల చైర్మన్ పోతులు విశ్వం విశేష కృషి చేశారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్మార్ట్ బ్రిడ్జ్ ప్రతినిధి జయప్రకాష్, కళాశాల డైరెక్టర్ బలరాం, ప్రిన్సిపల్ రవికాంత్, రేవతి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత జ్యోతి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం

**• కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య**




**కడప మన జనప్రగతి మే 07:-**కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఎన్.డి. విజయ జ్యోతి ఆదేశాల మేరకు గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో స్వర్గీయ దామోదరం సంజీవయ్య వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి జకరయ్య విలేకరులతో మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య భారతదేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారని తెలిపారు. అలాగే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) అధ్యక్ష పదవిని చేపట్టిన తొలి దళిత నేతగా ఆయన విశిష్ట గుర్తింపు పొందారని కొనియాడారు. 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో జన్మించిన దామోదరం సంజీవయ్య, సాధారణ కుటుంబం నుంచి ఎదిగి దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానం సంపాదించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించిన ఆయన, కేంద్ర కార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రిగా కూడా సేవలందించిన సంజీవయ్య, కార్మికుల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు చేపట్టారని పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి నేటి తరాలకు ఆదర్శమని అన్నారు. సత్తార్ ఖాజా మైనుద్దీన్, కమల్ భాష కోటపాటి లక్ష్మయ్య, మామిళ్ళ బాబు,మొహిద్దిన్ ఖాన్, దాసరి శ్రీనివాసులు, అఖిల్, షేక్ చాన్ బాషా, ప్రభు కుమార్, గౌరీ దేవి, సయ్యద్ షబానా, పాలెం హరిప్రసాద్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుపై దాడి చేసిన కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**• పాత్రికేయులపై దాడులు హత్యల పై మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి**

**• ఏపీ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు**



**పీలేరు మన జనప్రగతి మే 07:-** సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైనదైనా, ఇటీవల జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాద సంకేతాలుగా మారుతున్నాయని ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని వి.కోటకు చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి జగన్మోహన్ రెడ్డిని దారుణంగా హత్య చేయడం జర్నలిజం చరిత్రలో మర్చిపోలేని ఘటనగా నిలిచిందన్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయుడిని హత్య చేయడం అనేది కేవలం ఒక వ్యక్తిపై దాడి మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడిగా భావించాలన్నారు.అలాగే ఇటీవల అనంతపురం జిల్లాలో గీతం జూనియర్ కాలేజీ యాజమాన్యం విలేకరి లక్ష్మణ్ నారాయణపై దాడికి పాల్పడటం తీవ్రంగా ఖండనీయమన్నారు. వార్తలు సేకరించేందుకు వెళ్లిన విలేకరిపై దౌర్జన్యానికి దిగడం మీడియా స్వేచ్ఛను అణచివేయాలనే ప్రయత్నంగా కనిపిస్తోందన్నారు. ఇటువంటి ఘటనలు జర్నలిస్టుల భద్రతపై అనేక సందేహాలు రేకెత్తిస్తున్నాయని పేర్కొన్నారు.జర్నలిస్టులు ప్రజల కళ్లూ చెవులూ లాంటివారని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యత వారిదేనని చెప్పారు. అలాంటి వారిపైనే దాడులు జరగడం ఎంతో బాధాకరమని అన్నారు. ఒక జర్నలిస్టు స్వేచ్ఛగా పనిచేయలేని పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్యానికి తీవ్రమైన నష్టం జరుగుతుందని హెచ్చరించారు.ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న సంఘటనలను చూస్తుంటే జర్నలిజం లోకం యొక్క మనుగడ ఎటువైపు వెళుతుందో సమాజం మొత్తం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నిజాలను వెలుగులోకి తెచ్చే వారిని భయపెట్టడం ద్వారా సమాజంలో సమాచార హక్కును హరించే పరిస్థితులు ఏర్పడుతున్నాయనిఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని, పాత్రికేయులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే జర్నలిస్టులు కూడా నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉండాలంటే జర్నలిస్టుల భద్రత, మీడియా స్వేచ్ఛ కాపాడబడాలని పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు.

# వేర్వేరు కేసుల్లో ముగ్గురు అరెస్ట్... 50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం





**కాకినాడ మన జనప్రగతి మే 07:-** జిల్లాలో వరుస చైన్‌స్నాచింగ్‌లు, ఇంటి దొంగతనాలు, మోటార్ సైకిల్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను కాకినాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 50 లక్షల 16 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు, నగదు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి గురువారం జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ విలేకరులకు వివరాలను తన కార్యాలయంలో వెల్లడించారు.కాకినాడ-2 టౌన్, సర్పవరం, పిఠాపురం, ఇంద్రపాలెం, కోరింగ పోలీస్ స్టేషన్ల పరిధితో పాటు కోనసీమ జిల్లా దాక్షారామంలో నమోదైన 12 కేసులను పోలీసులు ఛేదించగా వీటిలో ఏడు చైన్‌స్నాచింగ్‌లు, రెండు ఇంటి దొంగతనాలు, ఒక ఏటీఎం కార్డు మోసం, రెండు మోటార్‌సైకిల్ చోరీ కేసులు ఉన్నాయన్నారు.చైన్ స్నాచింగ్ కేసుల్లో అరెస్టైన పల్లా సురేంద్రకుమార్, రంగాల శ్రీనివాసరెడ్డి వద్ద నుంచి 320 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి, 40 వేల నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 46లక్షల 50 వేల రూపాయలని ఎస్పీ చెప్పారు. మరో నిందితుడు రచ్చ నాగ సతీష్‌కుమార్ అలియాస్ బబ్లు వద్ద నుంచి 430 గ్రాముల వెండి, మూడు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 3 లక్షల 66 వేల వరకు ఉంటుందని చెప్పారు.నిందితులు ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఏటీఎంల వద్ద వృద్ధులకు సహాయం చేస్తున్నట్లు నటించి కార్డులు మార్చి నగదు దోచుకునేవారని పేర్కొన్నారు. తాళాలు వేసి ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేయడం, బయట పార్క్ చేసిన మోటార్‌సైకిళ్లను దొంగిలించడం వీరి నేర పద్ధతిగా వెల్లడైందన్నారు. బంగారు గొలుసు దొంగతనాల ముద్దాయిలను బుధవారం సామర్లకోట రోడ్లోను, మోటార్ సైకిల్ దొంగతనం కేసులో ముద్దాయిని వలసపాకలలో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. విహారయాత్రలకు ఇల్లు వదిలి దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు తెలియజేస్తే తాము వచ్చి ఎల్ హెచ్‌ఎంఎస్ అనే పరికరాన్ని అమర్చుతామని దానిని వినియోగికోవాలని ఎస్పీ సూచించారు.ఈ కేసులను ఛేదించిన ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్బి డిఎస్పి కెవివి సత్యనారాయణ, సీసీఎస్ సీఐ వి కృష్ణ, కాకినాడ టూ టౌన్స్ ఆర్ అప్పలనాయుడు, సామర్లకోట క్రైమ్ సీఐ ఆర్ అంకబాబు, కాకినాడ-2 టౌన్ ఎస్ఐ బుజ్జిబాబు, సర్పవరం ఎస్ఐ ఎం ఏసుబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.

# రైస్ కార్డుదారులలో ఇంకనూ ఈ-కేవైసీ పూర్తి చేయించుకోని సభ్యులు

**• వెంటనే ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోండి: జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా**



**కడప మన జనప్రగతి మే 07:-**వై.ఎస్.ఆర్. కడప జిల్లాలోని రైస్ కార్డుదారులలో ఇంకనూ ఈ-కేవైసీ పూర్తి చేయించుకోని సభ్యులు వెంటనే తమ సమీపంలోని రేషన్ దుకాణ డీలర్‌ను లేదా స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయాన్ని సంప్రదించి ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవలసింది జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా గురువారం ఒక ప్రకటన లో తెలిపారు...జిల్లాలో ఇప్పటికీ మొత్తం 39,104 మంది ఈ-కేవైసీ పూర్తి చేయించుకోలేదని, అందులో అత్యధికంగా కడప నియోజకవర్గంలో 7,633 మంది, ప్రొద్దుటూరులో 4,297 మంది, రాజంపేటలో 3,029 మంది ఈ-కేవైసీ చేయించుకోవలసి ఉన్నదని తెలిపారు అందువల్ల జిల్లాలోని అన్ని తహశీల్దార్లు, సీఎస్‌డీటీలు తమ పరిధిలోని వీఆర్వోలు మరియు రేషన్ దుకాణ డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, పెండింగ్‌లో ఉన్న ఈ-కేవైసీలను ఈ-పోస్ లేదా జీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్ యాప్ ద్వారా త్వరితగతిన పూర్తి చేయించవలసిందిగా ఆదేశించడమైనది.ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతున్నందున, కార్డుదారులు తమ సమీపం లోని రేషన్ దుకాణాలను సందర్శించి వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవలసిందిగా జిల్లా సంయుక్త కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అల్లూరి నేటి తరానికి ఆదర్శం:చమర్తి జగన్ మోహన్ రాజు

# రాజంపేటలో అల్లూరి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**• యువత దేశభక్తులను స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలి అని పిలుపు**



**రాజంపేట మన జనప్రగతి మే 07:-** తెలుగుజాతి గౌరవించే ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతిబింబం,అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన గిరిజన హక్కుల పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు నీ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు.గురువారం రాజంపేట పట్టణం నందు పర్యటిస్తూ ఆర్ అండ్ బి అతిథి గృహం నందు ఉన్న అల్లూరి వర్ధంతి సందర్భంగా మహనీయుని సేవలు స్మరిస్తూ పూలమాలలు వేసి చమర్తి జగన్ మోహన్ రాజు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ పీడితుల దుఃఖాన్ని తన దుఃఖంగా భావించిన యోధుడు అల్లూరేని జగన్ మోహన్ రాజు గారు కొనియాడారు.అదేవిధంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు వంటి దేశభక్తులను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ తరాలు తమను తాము గొప్పగా మలుచుకోవాలని జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నేసుబ్బ నరసయ్య నాయుడు,తెలుగు యువత పట్టణ అధ్యక్షులు నూకల రమేష్ బాబు,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు జగదాభి పాండురాజు, మాజీ మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు,శంకర్ రాజు,శివకుమార్ రాజు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కె కరీమ్, సిద్ధిక్ క్షత్రియులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గోవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి




**హైదరాబాద్ మన జనప్రగతి మే 07:-** రాష్ట్రంలో గోవధ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి గోవుల రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రితీష్ జాగిర్దార్, శ్రీ జైన్ సేవా సంఘ్ హైదరాబాద్ పీఆర్ఓ ప్రవీణ్ పాండ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపిఎస్ ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా విచ్చలవిడిగా గోవులను హైదరాబాద్ నగరానికి తరలించే అవకాశం ఉన్నందున ఎక్కడిక్కడ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా గోవులను తరలించకుండా పోలీస్ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. నిత్యం వేలాధి పశువులను వధిస్తుండటంతో గోవుల సంతతి తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి వెన్నెముకగా ఉన్న పశువులు మన ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమని, శతాబ్దాలుగా మానవ మనుగడకు, సమాజానికి గోవులు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయని అన్నారు.


# అనుమతులు లేని నిర్మాణాలు ముందే గుర్తించి నిలుపుదల చేయండి: ఇంచార్జి కమిషనర్ శారదా దేవి



**తిరుపతి మన జనప్రగతి మే 07:-** నగరంలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలను ముందే గుర్తించి నిలుపుదల చేయాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని పోస్టల్ కాలనీ, నారాయణ పురం, డి. బి. ఆర్ రోడ్డు, చింతలచేను, కైకాల చెరువు తదితర ప్రాంతాల్లో ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులతో పాటు, నిర్మాణాలను పరిశీలించారు. నగరంలోని ఫుట్ పాత్ ఆక్రమణలు, అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నట్లు పిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది నగరంలో పర్యటిస్తూ అనుమతులు లేని నిర్మాణాలు గుర్తించి ముందే అడ్డుకోవాలని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇంచార్జి కమిషనర్ వెంట ఏసీపీ పార్వతి ప్రియ, స్వర్ణ వార్డు కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం

- **జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ**



**అన్నమయ్య బ్యూరో మన జనప్రగతి మే 07:-** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం, పోరాట స్ఫూర్తి, ఆదర్శాలు నేటి తరానికి మార్గదర్శకమని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పేర్కొన్నారు. గురువారం మదనపల్లిలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి తదితర జిల్లా అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, తెలుగు నేలలో జన్మించి స్వాతంత్ర్య సమరంలో గిరిజనుల హక్కుల కోసం బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డి పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మహనీయుడని కొనియాడారు. అటవీ సంపద పరిరక్షణ, గిరిజనుల హక్కులపై అవగాహన కల్పించడం, వారిని చైతన్యవంతులను చేయడం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. అల్లూరి పోరాట ఫలితంగానే గిరిజన సంక్షేమం, అటవీ హక్కుల పరిరక్షణ దిశగా ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, అల్లూరి చూపిన సేవా మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, డ్వామా పీడీ వెంకటరత్నం, స్టెప్ అధికారి నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ రహిత జిల్లాగా అన్నమయ్యను తీర్చిదిద్దుదాం

- **మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ**



**అన్నమయ్య బ్యూరో మన జన ప్రగతి మే 07:-** అన్నమయ్య జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పిలుపునిచ్చారు. గురువారం మదనపల్లిలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమానికి సంబంధించిన అవగాహన కరపత్రాలను సంయుక్త కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలో ఎయిడ్స్ నివారణ,నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సంబంధిత వైద్య సేవా కేంద్రాలు,సమీకృత సలహా మరియు పరీక్షా కేంద్రాలు,స్వచ్ఛంద సేవా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించడంతో పాటు, హెచ్ఐవి నిర్ధారణ అయిన వారికి క్రమం తప్పకుండా చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన పరీక్షా సామగ్రి,మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఎయిడ్స్ నిర్మూలన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని, సమిష్టి కృషితో జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ మరియు కుష్టు నివారణ అధికారి డాక్టర్ రాధిక,కార్యక్రమ సమన్వయ అధికారి వి.భాస్కర్,జిల్లా సహకారశాఖ అధికారి త్యాగరాజు,వ్యవసాయ శాఖ జేడి తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన జిల్లా అదనపు ఎస్.పి(అడ్మిన్) కె. ప్రకాష్ బాబు



**కడప టౌన్ మన జనప్రగతి మే 07:-** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు ఘన నివాళి అర్పించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర కీలకమైందని, పరిమిత వనరులతో బ్రిటిష్ వారిని గడగడలాడించిన పోరాటయోధుడని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు ది ప్రత్యేక అధ్యాయమని, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి నిప్పు కణిక రాజేసి ఉద్యమ కొనసాగింపుకు స్ఫూర్తి గా నిలిచారన్నారు. బ్రిటిష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు పోరాటపటిమను కొనియాడారు. బ్రిటిష్ వారి నిరంకుశ చర్యల వలన మన్యం ప్రజలు ఎదుర్కొంటున్న దీనస్థితిగతులను పరిశీలించి ప్రజలను చైతన్యపరిచి విప్లవానికి నాంది పలికాడదని, బ్రిటిష్ పాలకుల దోపిడీ, దురాగతాలు, దమనకాండల నుండి విముక్తి కొరకు సీతారామరాజు గారు సాగించిన సాయుధ పోరాటం తెలుగు జాతి చరిత్రలో గొప్ప ఘట్టంగా చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, మన్యం వీరుడు అల్లూరి జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని, అల్లూరిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఎ.ఆర్ ) బి. రమణయ్య, ఎ.అర్ డి.ఎస్పీ పి. నాగేశ్వరావు , పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఆర్.ఐలు సోమశేఖర్ నాయక్, శ్రీశైల రెడ్డి, టైటాస్, ఆర్.ఎస్.ఐ లు, డి.పి.ఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సులపై కఠిన తనిఖీలు..రాయచోటి రవాణా శాఖ చర్యలు



**అన్నమయ్య బ్యూరో మన జనప్రగతి మే 07:-** రాయచోటి నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాల్లో ప్రైవేట్ పాఠశాల బస్సులపై గురువారం రవాణా శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తం సుమారు 60 బస్సులను పరిశీలిస్తూ వాహనాల డాక్యుమెంట్లు, డ్రైవర్ల అర్హతలు, భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల్లో భాగంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్నెస్, పర్మిట్, టాక్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యేలా ఉండాలని అధికారులు సూచించారు. స్కూల్ బస్సు నడిపే డ్రైవర్‌కు హెవీ మోటార్ వాహన లైసెన్స్‌తో పాటు కనీసం ఐదు సంవత్సరాల అనుభవం ఉండాలి, వయస్సు 60 సంవత్సరాల లోపు ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి బస్సులో ఒక అటెండర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. బస్సులపై స్కూల్ పేరు, చిరునామా, ఫోన్ నంబర్ స్పష్టంగా ఉండాలని, అంబర్ లైట్స్, ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్లు, ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నిబంధనలు పాటించని బస్సులపై జరిమానాలు, వాహనాల సీజ్, ఫిట్నెస్ రద్దు వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే కొన్ని యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, పాఠశాల ప్రారంభానికి ముందే లోపాలు సరిచేయాలని సూచించారు.

# అల్లూరి సీతారామరాజుకు టీడీపీ ఘన నివాళి

- **రాయచోటిలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమం**
- **యువ నాయకుడు మౌర్య రెడ్డి నివాళి**
- **అల్లూరి ఆశయాల సాధనకు కట్టుబడి టీడీపీ**




**అన్నమయ్య బ్యూరో మన జనప్రగతి మే 07:-** మన్యం వీరుడు,విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా రాయచోటిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. అల్లూరి చిత్రపటానికి టీడీపీ యువ నాయకులు మిన్నం రెడ్డి మౌర్య రెడ్డి, ఇతర పార్టీ నాయకులు,కార్యకర్తలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మిన్నం రెడ్డి మౌర్య రెడ్డి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగాలను కొనియాడారు. 27 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన ధైర్యవంతుడు అల్లూరి అని పేర్కొన్నారు. అన్యాయానికి ఎదురొడ్డి పోరాడే స్ఫూర్తి ఆయన నుంచి ప్రతి ఒక్కరూ పొందాలని అన్నారు. అన్న ఎన్టీఆర్ తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించగా, అనంతరం చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. ప్రస్తుతం నారా లోకేష్ యువగళంతో,మంత్రి రాంప్రసాద్ రెడ్డి నాయకత్వంలో అదే పోరాట పటిమ కొనసాగుతుందని వివరించారు. ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి ఆశయ సాధనకు టీడీపీ కట్టుబడి ఉందని, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా నిజమైన నివాళి అర్పించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని "జోహార్ అల్లూరి సీతారామరాజు" అంటూ నినాదాలు చేశారు.



# అల్లూరికి ఘన నివాళి

**కడప మన జనప్రగతి మే 07 :-** దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన అల్లూరి పోరాట పటిమ యువత కు స్ఫూర్తి దాయకమని ఇన్చార్జి డి ఆర్ ఓ వెంకట పతి తెలిపారు. గురువారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ఘన నివాళు లు అర్పించింది. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్ నందు నిర్వహించిన కార్యక్రమం నకు ముఖ్య అతిథిగా ఇంచార్జి డి ఆర్ ఓ పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు .ఈ సందర్భంగా ఇంచార్జి డి ఆర్ ఓ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన అల్లూరి పోరాట పటిమ యువతకుస్ఫూర్తిదాయకమని కొనియాడారు. గిరిజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో నిలిచి పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొని అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తత అవసరం

- **ఫైర్ సేఫ్టీ వీక్‌లో భాగంగా అవగాహన కార్యక్రమం**



**వేంపల్లె మన జనప్రగతి మే 07:-** ఫైర్ సేఫ్టీ వీక్‌లో భాగంగా వేంపల్లి ఫైర్ స్టేషన్ సిబ్బంది గురువారం స్థానిక పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక కేంద్రాధికారి బి. శివరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గృహాలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ పరికరాల వినియోగంలో నిర్లక్ష్యం వహిస్తే భారీ అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని అగ్నిమాపక కేంద్రాధికారి బి. శివరామిరెడ్డి తెలిపారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో ప్రజలు భయాందోళనల కు గురికాకుండా వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించి అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన మాక్‌డ్రిల్‌లో అగ్నిమాపక పరికరాల వినియోగ విధానం, మంటలను అదుపులోకి తీసుకొచ్చే పద్ధతులను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది మహమ్మద్ సాలార్, చిన్ను, భీమాంజనేయులు, ఆసిఫ్‌తో పాటు కాలనీ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం

**- కలకడ తహసీల్దార్ మహేశ్వరి బాయ్**



**కలకడ మన జనప్రగతి మే 07:-** మండలంలోని మాదినేనిపాలెం గ్రామంలో "నెలకు ఒక గ్రామం నాలుగు దఫాల గ్రామ సందర్శన" కార్యక్రమంలో భాగంగా గురువారం తహసీల్దార్ మహేశ్వరి బాయ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహేశ్వరి బాయ్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఉన్న రెవెన్యూ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. తొలి దఫాలో భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తామని,రెండవ దఫాలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతామని చెప్పారు. మూడవ దఫాలో పిటిషనర్లకు తగిన ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని, నాలుగవ దఫాలో న్యాయపరమైన సమస్యలపై ప్రజల సమక్షంలో మార్గదర్శక సూచనలు అందిస్తామని వివరించారు. గ్రామసభలో రైతుల భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి నమోదు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది,అధికారులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యంత్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అన్నమయ్య జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 07:**–లక్కిరెడ్డిపల్లి మండలంలో 202526 సంవత్సరానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రాజకుమారి తెలిపారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, రోటావేటర్లు, స్ప్రేయర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు, విత్తన యంత్రాలు, పంటతరువాత వినియోగ పరికరాలు తదితర వ్యవసాయ యంత్రాలను రాయితీపై రైతులకు అందించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న మరియు సన్నకారు రైతులు, మహిళా రైతులకు యంత్రాల ధరపై గరిష్టంగా 50 శాతం వరకు సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం వరకు సబ్సిడీ అందించబడుతుంది.భూమి కలిగిన రైతులు, అటవీ హక్కుల చట్టం కింద అర్హత పొందిన రైతులు, గత మూడు సంవత్సరాలలో కనీసం మూడు పంట సీజన్లలో ఈ–పంట నమోదు చేసిన కౌలు రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే గత సంవత్సరం (202425) ఈ పథకం కింద సబ్సిడీ పొందిన వారు ఈసారి అర్హులు కారని స్పష్టం చేశారు.రైతులు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వెబ్సైట్ https://eseed.ap.gov.in/FM/`ల ద్వారా లేదా సమీప రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్కే)లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ మే 5, 2026 నుండి మే 19, 2026 అర్ధరాత్రి వరకు కొనసా గుతుందని తెలిపారు.లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శ కంగా ఆన్లైన్ లాటరీ విధానంలో నిర్వహించబడుతుందని, ఎంపికైన రైతులకు జాయింట్ కలెక్టర్ ద్వారా మంజూరు పత్రా లు జారీ చేయబడతాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా ఉత్పాదకతను పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి కోరారు.

## పీర్ల చావిడిని ఘనంగా ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ



**పత్తికొండ మన జనప్రగతి మే 07:**–పత్తికొండ మండలం ఆర్.మండగిరి గ్రామంలో నూతనంగా నిర్మించిన పీర్ల చావిడిని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమీపంలోని దర్గాను సందర్శించిన శ్రీదేవమ్మ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని,రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధి,ప్రజల సంక్షేమం కోసం తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ మండలం మాజీ సర్పంచులు,మండల కన్వీనర్, ఎంపీపీ, మండగిరి గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పులివెందులలో ముమ్మరంగా గృహ గణన సర్వే

**- వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 07:**జనగణన 2027 ప్రక్రియలో భాగంగా పులివెందుల పట్టణ పరిధిలో జరుగుతున్న గృహ జాబితా మరియు గృహ గణన సర్వేను ఆర్డిఓ చిన్నయ్య, సెన్సెస్ చార్జ్ ఆఫీసర్ మున్సిపల్ కమిషనర్ సి ముని కుమార్ గురువారం క్షేత్రస్థా యిలో తనిఖీ చేశారు.పట్టణంలోని 19,28 మరియు 70వ హౌస్ లిస్టింగ్ బ్లాకుల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను పులివెందుల రెవెన్యూ డివిజనల్ అధికారి సెన్సస్ చార్జ్ ఆఫీసర్ మరియు మున్సిపల్ కమిషనర్ సంయుక్తంగా పరిశీలించారు.అధికారులు స్వయంగా ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో, ఎటువంటి పొరపాట్లు లేకుండా అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు.ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పని చేస్తూ ప్రతి ఇంటినీ తప్పకుండా సందర్శించి వివరాలు సేకరించాలని సూచించారు.ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు సర్వే ప్రాముఖ్యతను గుర్తించి,సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించి సర్వేను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంబంధిత ఎన్యూమరేటర్లు బయమత్ బాబు,సల్మా బేగం, రాజగోపాల్,రోహిణి,మల్లేశ్వర్ రెడ్డి,అయేషా తదితరులు పాల్గొన్నారు.

## 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంపై చేనేత కార్మికుల హర్షం

**● ఎన్నికల హామీ మేరకు రూ. 25 వేల ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి**



**సిద్దవటం మన జనప్రగతి మే 07:**– రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం పట్ల చేనేత కార్మికులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. గురువారం సిద్దవటం మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలో గల యస్.కే.ఆర్ నగర్ చేనేత క్లస్టర్ భవనంలో కార్మికులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. తాము కోరకుండానే ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించడం ఒక గొప్ప వరం వంటిదని, దీనివల్ల నేత కార్మికులపై కరెంటు బిల్లుల భారం తగ్గుతుందని కూటమి ప్రభుత్వానికి జీరో వచ్చిన బిల్లులు చూపిస్తూ సంతోషంతో కృతజ్ఞతలు తెలిపారు. ఇదే క్రమంలో ప్రభుత్వం తమకు ఇచ్చిన ఇతర హామీలను కూడా నెరవేర్చాలని వారు కోరారు. ముఖ్యంగా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 'నేతన్న నేస్తం' పథకం కింద ఇచ్చే వార్షిక ఆర్థిక సాయాన్ని రూ. 25,000లకు పెంచి తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మార్కెట్లో ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల చేనేత వృత్తి భారంగా మారిందని, ఈ తరుణంలో రూ. 25 వేల ఆర్థిక సాయం అందితే కార్మికులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. ఆగస్టు 7న రానున్న 'జాతీయ చేనేత దినోత్సవం' నాటికి ఈ నిధులను నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేసేలా ముఖ్యమంత్రి చొరవ చూపాలని వారు కోరారు. ఈ సాయం అందిస్తే చేనేత కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా ప్రభుత్వానికి అండగా నిలుస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, చేనేత విభాగం కార్యదర్శి శ్రీరాందాసు వెంకట్, సొసైటీ అధ్యక్షులు గంజి సుబ్బరాయుడు, జింకా శ్రీనివాసులు, మునగపాటి సుబ్బరాయుడు, వార్డు మెంబర్ సామల చెంగయ్య, పుత్తా రవి, మల్లూరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కూటమి ప్రభుత్వంతో పాటు విద్యుత్ మరియు చేనేత జౌళి శాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఐవీఆర్ సర్వేపై రెవెన్యూ డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం



**పీలేరు మన జనప్రగతి మే 07:**– రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ (ఐ.వి.ఆర్) సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచిస్తూ పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులతో పీలేరు పంచాయతీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని డీపీఓ రాధమ్మ, డీడీఓ లక్ష్మీపతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు ఐవీఆర్ సర్వే కీలకమని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా సేవలను మరింత మెరుగుపర్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అలాగే పన్నుల వసూళ్లపై కూడా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ నెల 31వ తేదీ లోపు పన్నులు చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రాయితీ అందజేస్తోందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని గడువులోపు పన్నులు చెల్లించాలని అధికారులు కోరారు. పన్నుల చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వ లక్ష్యాలను సమయానికి పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమిష్టిగా పనిచేయాలని డీపీఓ రాధమ్మ, డీడీఓ లక్ష్మీపతి సూచించారు.ఈ సమావేశంలో పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎండీఓలు, పీలేరు ఎండీఓ శివశంకర్, కె.వి.పల్లె ఎంపీడీఓ సుధాకర్, వాల్మీకి పురం ఎంపీడీఓ మనోహర్ రాజు, గుర్రంకొండ ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, కలకడ ఎంపీడీఓ భానుప్రసాద్, కలికిరి ఎండీఓ, డిప్యూటీ ఎండీఓలు, పీడీఓలు పాల్గొన్నారు.

## 43వ డివిజన్లో 'మన కడప స్వచ్ఛ కడప' మాస్ క్లీనింగ్ కార్యక్రమం

**● ఎమ్మెల్యే మాధవి రెడ్డి పాల్గొని పారిశుద్ధ్యంపై అవగాహన**

**● ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న అధికారులు**



**కడప మన జనప్రగతి మే 07:**–కడప నగరంలోని 43వ డివిజన్ కాగితాలపెంట దర్గా ప్రాంతంలో 'మన కడప స్వచ్ఛ కడప' కార్యక్రమం భాగంగా గురువారం మాస్ క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కడప కమిషనర్ రాకేష్ కూచిపూడి, డివిజన్ ఇంచార్జ్ సయ్యద్ యూనస్ ఆధ్వర్యంలో చేపట్టారు. ముఖ్య అతిథిగా కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వార్డులో పారిశుద్ధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికారులు ప్రతి వీధిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ డ్రైనేజీ, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి అంశాలపై స్థానికులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.పారిశుద్ధ్య లోపాలు ఎక్కడ ఉన్నా వెంటనే సరిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నగర సుందరీకరణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, స్వచ్ఛ కడప లక్ష్యంగా అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.టిడిపి నాయకులు మన్సూర్ అలీ ఖాన్, లోమడ మనోజ్, బోనం సులాస్, సుబ్బరాయుడు యాదవ్, రెడ్డయ్య యాదవ్, కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా పోస్టుల్లో కుల, అవినీతి ప్రాధాన్యతపై సీఎం సమాధానం చెప్పాలి

**● రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు డిమాండ్**



**అనంతపురం మన జనప్రగతి మే 07:**– రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా స్థాయి పోస్టుల కేటాయింపులో కుల ప్రాధాన్యత, అవినీతి, రాజకీయ ప్రభావం పెరిగిపోతున్నాయని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు పోతుల నాగరాజు ఆరోపించారు. ఈ విధానాల వల్ల నిజాయితీ, సీనియార్టీ, విద్యార్హతలు కలిగిన ఉద్యోగులు తీవ్ర నిరాశ, మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.ప్రత్యేకంగా అనంతపురం జిల్లాలో అర్హతలు లేని ఒకే వ్యక్తికి రెండు కీలక జిల్లా స్థాయి పోస్టులను కేటాయించడం అన్యాయమని ఆయన విమర్శించారు. సర్వ శిక్ష అభియాన్లో ప్రాజెక్ట్ ఆఫీసర్ గా, అలాగే ప్రాజెక్ట్ డైరెక్టర్ గా ఒకే వ్యక్తికి బాధ్యతలు అప్పగించడం ద్వారా జిల్లా ప్రజాప్రతినిధులు తమ కుల ప్రాధాన్యతను బహిర్గతం చేసుకున్నారని ఆరోపించారు.ఇలాంటి పరిస్థితులు , రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మెడికల్, మున్సిపల్ శాఖల్లో కూడా ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటైన కులానికి చెందిన వ్యక్తులకే ప్రాధాన్యత ఉన్న శాఖల్లో పోస్టులు కేటాయించడం, లేదా ముడుపులు చెల్లించే వారికి పదవులు ఇవ్వడం వల్ల ప్రతిభావంతులు, సీనియర్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు."సీనియార్టీ, విద్యార్హతలు, నిజాయితీ ఆధారంగా పోస్టులు ఇవ్వకుండా కులం, అవినీతి ఆధారంగా నియామకాలు చేస్తే నిజాయితీగా పనిచేసే అధికారుల పరిస్థితి ఏమిటి?" అని ఆయన ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్లు కూడా ఈ అంశాలపై స్పందించి పారదర్శకతతో వ్యవహరించాలని కోరారు.ప్రజల కోసం ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వివక్ష చూపకుండా, జిల్లా స్థాయి పోస్టులను ప్రతిభ, అనుభవం, సీనియార్టీ ఆధారంగా కేటాయించాలని ముఖ్యమంత్రి ని పోతుల నాగరాజు విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వ్యవస్థ కృత గ్రామస్థాయి సభలు

**● మండల తాసిల్దార్ విజయ కుమారి**




**చెన్నూరు మన జనప్రగతి మే 07:**– గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం" ఒక నెల మూడు గ్రామాలు నాలుగు పర్యటనలు పేరుతో ఒక వ్యవస్థా కృత గ్రామస్థాయి కార్యక్రమం" రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు గురువారం చెన్నూరు మండలం ముండ్లపల్లె గ్రామంలో వ్యవస్థ కృత సాయి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తాసిల్దార్ విజయకుమారి మాట్లాడుతూఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆదేశాల మేరకు గ్రామ స్థాయిలో ప్రజా సమస్యల వేగవంత పరిష్కారం, భూ వివాదాల నివారణ మరియుచ ప్రజలకు పారదర్శక సేవలందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి.కిరణ్ మోహన్ రావు గారు పాల్గొని గ్రామ ప్రజల నుండి భూ సంబంధిత వినతులు, సమస్యలు స్వీకరించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యల కోసం సూచనలు అందించారు.అలాగే మండల సర్వేయర్ గారు,మండల స్థాయి అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు( పిడిఓ ఎస్) గ్రామ సచివాలయ సిబ్బంది మరియు రైతులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా అధికారులు తమమాట్లాడుతూ గ్రామస్థాయిలోనే ప్రజా సమస్యలను పరిష్కరించడం ద్వారా రెవెన్యూ సంబంధిత వివాదాలు తగ్గి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందుతాయని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## రాజగోపుర ప్రాకార నిర్మాణానికి ప్రతి పాదనలు పంపాలి



**వేంపల్లె మన జనప్రగతి మే 07:**– స్థానిక ఎద్దుల కొండపై ఉన్న ఆలయం వద్ద రాజగోపుర ప్రాకార నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వృషబాచలేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన ఎద్దుల కొండపై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, దేవదాయ శాఖ సహాయ కమీషనర్ లు సందర్శించారు. అలాగే శ్రీ వెంకటేశ్వర స్వామికి పూజాలు చేసిన అనంతరం అర్చకుడు హరి ప్రవీణ్ తో ఆలయ చరిత్ర పై ఆరా తీశారు. ఎద్దుల కొండకు చెందిన ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చెట్లును విరివిగా పెంచాలని ఆదేశించారు. తులసి చెట్లు కూడ పెంచాలని సూచించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులను ఎద్దుల కొండపై ఉంచి పూజాలు జరిగేలా చూడాలని ఆలయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎద్దుల కొండపై ఆలయ అభివృద్ధి పనులు జరిగేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈయన వెంట దేవదాయ శాఖ సహాయ కమీషనర్ శంకర్ బాలాజీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణన సర్వేలో ప్రజల వివరాల సేకరణలో నిమగ్నమైన ఎన్యుమరేటర్లు



**బొమ్మనహల్ మన జనప్రగతి మే 07:**–బొమ్మనహాల్ మండలంలో కురవల్లి చంద్రగిరి గ్రామాలలో సూపర్వైజర్ మండల విద్యాశాఖధికారి వి.మల్లికార్జున ఆధ్వర్యంలో సెన్సస్ (జనగణన) సర్వే చెప్పటారు,ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు మంజూప్ప,అమరేష్,భాస్కర్ ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు,అదేవిదంగా ప్రజల వివరాలు,కుటుంబ సమాచారం సేకరిస్తూ గణన చేపట్టారు.ఈ సందర్భంగా ఎంఈఓ మల్లికార్జున మాట్లాడుతూ..ప్రజలు వారి సమాచారాన్ని పక్కగా అందించి సర్వేను అందరూ విజయవంతం చేయాలని కోరారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు

# అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి 2047 ప్రణాళికలు పటిష్టంగా అమలు: జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి మే 07:**-అన్నమయ్య జిల్లా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించే విధంగా..2047 విజన్ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేసే విధంగా కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి వివరించారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సదస్సులో జీఎస్డీపీ గ్రోత్, జిల్లాల వారీ జీఎస్డీపీ అంచనాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, విద్య-వైద్యం, పెట్టుబడుల గ్రౌండింగ్, జలధార వంటి అంశాలపై ముఖ్యమంత్రి గారు సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా సమీక్షలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశాలు, ఆశయాల మేరకు సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి, జీఎస్డీపీ లక్ష్యాలు, కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్లు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో లక్ష్యం మేరకు వందశాతం ప్రగతి సాధనకు కృషి చేయడం జరుగుతుందని వివరించారు. అలాగే ప్రభుత్వ అమలు చేస్తున్న వివిధ పథకాలలో ప్రజాసానుకుల అవగాహన పెంచేందుకు కూడా జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.అలాగే జిల్లాలో అమలు చేసిన జలధార కార్యక్రమం వల్ల భూగర్భ జలాలు పెరగడం మాత్రమే కాకుండా ప్రజల జీవన విధానం మారుతోందన్నారు. పాడి పరిశ్రమ, మత్స్య, ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన పంటలు సాగు పెంపు, రైతుల ఆర్థిక ఆదాయం మెరుగుపడే విధంగా ప్రణాళికబద్ధంగా కార్యాచరణతో ముందుకు వెళ్లేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన ప్రణాళికలు, కార్యాచరణ కార్యక్రమాలపై కూడా కలెక్టర్ ముఖ్యమంత్రికి సమగ్రంగా వివరించారు. ఈ సదస్సులో రాష్ట్ర మంత్రులు, చీఫ్ సెక్రటరీ, ఆయా శాఖల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పట్ల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం: మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆగ్రహం



**పత్తికొండ మన జనప్రగతి మే 07:**-పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ రైతుల పట్ల కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు దయనీయ స్థితిలో ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు.తుగ్గలి మండలం నునుసురాళ్ల గ్రామంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులతో కలిసి మామిడి తోటలను పరిశీలించిన శ్రీదేవమ్మ, అక్కడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మామిడి బాక్స్‌కు కనీసం రూ.2000 గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఏ పంట పండించిన రైతుకూ న్యాయం జరగడం లేదని ఆమె మండిపడ్డారు. ముఖ్యంగా ధాన్యం పండించిన రైతులు కూడా తమ పంటను అమ్ముకోలేక గిట్టుబాటు ధర కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు.జగనన్న ప్రభుత్వ హయాంలో పెట్టుబడి సాయం నుంచి గిట్టుబాటు ధర కల్పించే వరకు రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రైతులు పండించిన పంటను అమ్ముకునే పరిస్థితి కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు.ఇలాగే రైతులను నిర్లక్ష్యం చేస్తే వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో రైతుల తరఫున ఉద్యమాలు చేపడతామని కంగాటి శ్రీదేవమ్మ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల కన్వీనర్లు, కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశోధనలో మన ముద్ర కనబడాలి: వై.వి.యు.వి సి.బెల్లంకొండ రాజశేఖర్



**కడప మన జనప్రగతి మే 07:**-పరిశోధనలో మన ముద్ర కనబడే విధంగా శ్రమిస్తే పరిశోధకుడికి పర్యవేక్షకుడికి విశ్వవిద్యాలయానికి కూడా సరైన గుర్తింపు లభిస్తుందని యోగి వేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. గురువారం తెలుగు శాఖలో ఏర్పాటు చేసిన రీసెర్చ్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ముగింపు సభకు అతిథిగా విచ్చేసిన రాజశేఖర్ మాట్లాడుతూ పరిశోధనలు భావితరాలకు ఉపయోగపడేవిగా ఉండాలన్నారు. ఒక అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పిస్తే, అది తర్వాత తరాల పరిశోధకులకు ఆధార గ్రంథంలా నిలబడాలని, అప్పుడే ఆ పరిశోధనకు విలువ లభిస్తుందని వివరించారు. పరిశోధనలో నైతిక విలువలు పాటించాలని, గ్రంథ చౌర్యానికి దూరంగా ఉండాలని హితవు పలికారు. సమయపాలన, క్రమశిక్షణ, శ్రమించే లక్షణం, అధ్యయనశీలత, విశ్లేషణ సామర్థ్యం ప్రతి పరిశోధకుడు అలవాటు చేసుకోవాల్సిన లక్షణాలుగా పేర్కొన్నారు. తెలుగు శాఖను స్ఫూర్తిగా తీసుకొని వచ్చే విద్యా సంవత్సరం నుంచి యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ప్రతి శాఖ తనదైన పద్ధతిలో పరిశోధక విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య ఎం ఎం వినోదిని సభా సమన్వయం చేస్తూ తెలుగు శాఖలోని పరిశోధకులకు తెలుగులోనే పరిశోధనా పద్ధతులను బోధించడానికి అవకాశం కల్పించిన ఉపకులపతికి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు శాఖ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆచార్య రాజశేఖర్ ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత యోగి వేమన విశ్వవిద్యాలయంలో విద్యా ప్రణాళికలు కొత్త పంథాలో పయనిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ ఆచార్యులు రామప్రసాద రెడ్డి, పి రమాదేవి, జి పార్వతి, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిశ్రమల పేరిట ప్రగతా.. భూసేకరణ పేరిట దోపిడీయా..?



**ఉరవకొండ మన జనప్రగతి మే 07:**-రాయలసీమలో పరిశ్రమల స్థాపన పేరుతో జరుగుతున్న భూసేకరణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కరువు బాధలతో ఉన్న ఈ ప్రాంతంలో పరిశ్రమలు యువతకు ఉపాధి కల్పించాల్సి ఉండగా, భూముల స్వాధీనం ప్రక్రియపై విమర్శలు వినిపిస్తున్నాయి.సోలార్, విండ్, రక్షణ రంగ పరిశ్రమల పేరుతో వేల ఎకరాల భూములను తక్కువ ధరలకు స్వాధీనం చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రాజెక్టులు రాబోతున్నాయనే సమాచారం ముందుగానే తెలుసుకున్న కొందరు ప్రభావశీలులు ఆ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసి, తరువాత అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కియా పరిశ్రమ రాకతో జిల్లా అభివృద్ధి చెందుతుందని ప్రకటించినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని స్థానికులు చెబుతున్నారు. భూములు ఇచ్చిన రైతులకు సరైన పరిహారం అందలేదని, స్థానిక యువతకు ఉన్నత స్థాయి ఉద్యోగాలకన్నా తక్కువ స్థాయి పనులే లభించాయని పేర్కొంటున్నారు. ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని అంటున్నారు.భారీ పెట్టుబడులు వస్తున్నాయని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నప్పటికీ, వాటి ద్వారా లభించే ఉద్యోగాల సంఖ్య తక్కువగానే ఉందని గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడులు, ఉద్యోగాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.అభివృద్ధి, పరిహారాల విషయంలో ప్రాంతాల మధ్య అసమానతలు ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అధిక పరిహారం చెల్లిస్తుండగా, రాయలసీమలో తక్కువ మొత్తంతో సరిపెట్టడం ప్రాంతీయ వివక్షగా భావిస్తున్నారు.పరిశ్రమలు రావడం ద్వారా ప్రాంత అభివృద్ధి జరగాలని, అయితే అది స్థానిక రైతులు, ప్రజలకు నష్టం కలిగించకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# ఎస్.ఎం పండిట్ చిత్రాలు అజరామం: డాక్టర్ మోహన్ రావు పంచాల్



**కడప మన జనప్రగతి మే 07:-** ఎస్.ఎం పండిట్ చిత్రాలు అజరామం అని కర్ణాటకరాష్ట్ర హంపి విశ్వవిద్యాలయం చెందిన ప్రముఖ చిత్రకారుడు,లలిత కళ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మోహన్ పంచాల్ అన్నారు.యోగి వేమన విశ్వవిద్యాలయం లలితకళా విభాగం లో గురువారం ప్రఖ్యాత పౌరాణిక చిత్రకారులు ఎస్.ఎం పండిట్ వర్మ చిత్రాలపై ప్రెసెంటేషన్ ను హంపి విశ్వవిద్యాలయం,కర్ణాటక కి చెందిన ప్రముఖ చిత్రకారుడు లలిత కళ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మోహన్ పంచాల్ సుమారు వంద చిత్రాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా ప్రదర్శించారు.ఎస్.ఎం పండిట్ పెయింటింగ్ లో ఉపయోగించిన సాంకేతిక అంశాలు, ఆయన జీవిత విశేషాలను వెల్లడించారు. అనంతరం కళా రంగం లో మెళుకువలు,అవకాశాలు పై ఆసక్తి తో అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.ఈ సందర్భం గా విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయ రావు మాట్లాడుతూ రవివర్మ చిత్రాలతో స్ఫూర్తి పొంది చిత్రించిన చిత్రాలను లో అత్యున్నత సౌందర్య విలువలు గల చిత్రాలు ను రూపొందించిన ఎస్.ఎం పండిట్ చిత్రాలు అజరామన్నారు.ఎస్.ఎం.పండిట్ చిత్రాలను డాక్టర్ మోహన్ పంచాల్ అద్భుతంగా చిత్రీకరించారన్నారు.విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయ రావు మోహన్ పంచాల్ ను శాలువాతో సత్కరించి,జ్ఞాపికను బహుకరించారు.ఈ కార్యక్రమ లో అధ్యాపకులు వెంకటేష్,చినరాయుడు,ఈరప్ప,ఎం.వాసవి,చంటి సూరి,విద్యార్థి విదార్థులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో ప్రతిభ చాటిన సుహానాకు ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి అభినందనలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 07:**పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సుహానాను కడప పార్లమెంట్ సభ్యులు వై.ఎస్.అవినాష్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. గురువారం పులివెందులలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.పులివెందుల ఇస్లాంపురం జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సుహానా పదవ తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 524 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది.తండ్రి వృత్తిరీత్యా టైలర్ కావడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ,క్రమశిక్షణతో చదివి ఈ విజయాన్ని అందుకోవడం పట్ల ఎంపీ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థిని మరియు వారి తల్లిదండ్రులను అభినందించిన అవినాష్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు విద్యావంతులదే అని ప్రతిభకు పేదరికం ఎన్నడూ అడ్డుకాకూడదు అని ఎట్టి పరిస్థితుల్లోనూ చదువును ఆపవద్దు అని హితవు పలికారు.సుహానా భవిష్యత్తులో చేపట్టబోయే ఉన్నత చదువులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పులివెందుల మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ హాఫీజ్ మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# 2023లో జారీ చేసిన వైవీయూ.. అధ్యాపక పోస్టుల నియామక నోటిఫికేషన్ల ఉపసంహరణ



**కడప మన జనప్రగతి మే 07:-** 2023 సంవత్సరంలో జారీ చేసిన యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపక పోస్టుల నియామక నోటిఫికేషన్ల ఉపసంహరణ జరిగినట్లు విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య పి.పద్మ తెలిపారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 59 ఉత్తర్వుల ప్రకారం, విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న 118 అధ్యాపక పోస్టుల భర్తీకి గతంలో ఇచ్చిన అనుమతినివైవియూ కార్యనిర్వాహక మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) తీర్మానం ప్రకారం ఉపసంహరించుకోవడం జరిగిందని వివరించారు.అందువలన, సదరు పోస్టుల భర్తీ కోసం 2023 సంవత్సరం అక్టోబర్ 30వ తేదీన జారీ చేసిన అధ్యాపక నియామక నోటిఫికేషన్లు ఉపసంహరణ అయ్యాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, దరఖాస్తు రుసుము తిరిగి పొందేందుకు సంబంధించిన సమాచారం కోసం విశ్వవిద్యాలయ వెబ్సైట్ www.yvu.edu.in ని సందర్శించాలని సూచించారు. నూతన నోటిఫికేషన్ల తేదీలు, ఇతర వివరాలు ప్రకటించడం జరుగుతుందని ఆచార్య పద్మ తెలిపారు.

# అర్ధరాత్రి అపాయం.. శక్తి యాప్‌తో రక్షణ

- 10 నిమిషాల్లో పోలీసుల చేరిక
- యువతి సురక్షితంగా ఇంటికి



**వేంపల్లి మన జనప్రగతి మే 07:**-అర్ధరాత్రి ఆపదలో చిక్కుకున్న యువతిని సమయోచితంగా స్పందించిన పోలీసులు సురక్షితంగా రక్షించారు. శక్తి యాప్ సహాయంతో జరిగిన ఈ ఘటనపై స్థానిక జనసేన నాయకులు పోలీసులను అభినందించారు.వివరాల్లోకి వెళితేడ బెంగళూరు నుంచి విజయవాడకు వచ్చిన ఓ యువతి అర్ధరాత్రి సమయానికి ఒంటరిగా నడిరోడ్డుపై నిలిచిపోయింది. చుట్టుపక్కల ఎవరూ లేక, తీవ్ర భయాందోళనలో ఉన్న సమయంలో ఒక ఆటో డ్రైవర్ ఆమెను మాయమాటలు చెప్పి ఆటోలో ఎక్కించాడు. ప్రయాణం మధ్యలో అతని ప్రవర్తన అనుమానాస్పదంగా మారడంతో పరిస్థితిని అర్థం చేసుకున్న యువతి వెంటనే తన మొబైల్‌లో శక్తి యాప్ ద్వారా ఎమర్జెన్సీ అలర్ట్ ఇచ్చింది.అలర్ట్ అందుకున్న వెంటనే మంగళగిరి ఎస్సై వెంకట్ తన సిబ్బందితో స్పందించి, ఆటోను చేజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. యువతిని సురక్షితంగా ఆమె గమ్యస్థానానికి చేర్చారు.ఈ ఘటనపై జనసేన నాయకుడు గోసల ఆంజనేయులు మాట్లాడుతూ, "మహిళలు అర్ధరాత్రి కూడా భయపడకుండా సంచరించగలిగే స్థితి వచ్చినప్పుడే నిజమైన స్వాతంత్రం ఉంటుంది.ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ పోలీసులు చాకచక్యంగా స్పందించి ఒక యువతి ప్రాణాలను కాపాడటం అభినందనీయం" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రతి మహిళ తన మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవాలని సూచించారు.

# గోవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



**హైదరాబాద్, మన జనప్రగతి మే 07:**-రాష్ట్రంలో గోవధ నిరోదక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి గోవుల రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రితీష్ జాగిర్దార్, శ్రీ జైన్ సేవా సంఘ్ హైదరాబాద్ పీఆర్ఓ ప్రవీణ్ పాండ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపిఎస్ ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా విచ్చలవిడిగా గోవులను హైదరాబాద్ నగరానికి తరలించే అవకాశం ఉన్నందున ఎక్కడిక్కడ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా గోవులను తరలించకుండా పోలీస్ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. నిత్యం వేలాధి పశువులను వధిస్తుండటంతో గోవుల సంతతి తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి వెన్నెముకగా ఉన్న పశువులు మన ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమని, శతాబ్దాలుగా మానవ మనుగడకు, సమాజానికి గోవులు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయని అన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08 -05-2026

# నేను కాదు... మనం.. క్షేత్ర స్థాయి ఉద్యోగుల అనుభవాన్ని వినియోగించుకోవాలి

**సింగపూర్ ఉత్తమ విధానాలను ఓ జిల్లాలో అమలు చేద్దాం**

**టూరిజం అభివృద్ధి చేసిన జిల్లాకు అత్యధిక ఆదాయం**

**7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు**

**అమరావతి మన జనప్రగతి మే 07:–** టీమ్ వర్క్‌తోనే అభివృద్ధి జరుగుతుందని... నేను అని కాకుండా.. మనం అనే ఆలోచన విధానం అందరిలో రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక నుంచి తాను కూడా నేను అనే పదాన్ని పక్కన పెట్టి మనం అనే పదాన్ని ఉపయోగిస్తానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో వివిధ అంశాలపై చర్చ జరిగింది. దీంట్లో భాగంగా జీఎస్డీపీ గ్రోత్, జిల్లాల వారీగా జీఎస్డీపీ అంచనాలు, సింగపూర్ దేశంలో మంత్రులకు ట్రైనింగ్ వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."నేర్చుకోవటం అనేది నిరంతర ప్రక్రియ, అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. సింగపూర్ దేశంలో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయి. సింగపూర్ అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను తీసుకుని ఓ జిల్లాను మోడల్ గా అభివృద్ధి చేద్దాం. సింగపూర్ విధానాల అమలుకు 90 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి పర్యవేక్షణ చేపట్టాలి. సింగపూర్ దేశంలో నేను కాదు.. మనం అనే విధానాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూడా నేను కాదు మనం అనే విధానాన్నే అవలంభిద్దాం. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చినా... సంక్షేమ, అభివృద్ధి జరుగుతున్నా.. అందరి కృషి వల్లే సాధ్యమైంది. కలిసి కట్టుగా పని చేస్తే... ప్రతి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఓన్ చేసుకుంటే ప్రభుత్వం మరింత విజయవంతంగా సేవలు






అందించగలదు. నేను కాదు మనం అనే విధానాన్ని నాతో ప్రారంభిస్తున్నా. ప్రతి ఒక్కరూ ఇదే తరహాలో ఆలోచన చేయాలి. జీఎస్డీపీ విషయంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో ప్రజలపై ప్రభావం చూపిస్తాయి. గిరిజన ప్రాంతంలో ఉంటూనే పార్వతీపురం, అల్లూరి జిల్లాల్లో అభివృద్ధి వేర్వేరుగా ఉంది. అల్లూరి జిల్లాలో కాఫీ పంటకు విలువ జోడింపుతో జీఎస్డీపీ ఎక్కువగా ఉంది. అభివృద్ధిపై దృష్టి సారించాలి... ప్రగతి సాధనలో కీలకంగా వ్యవహరించాలి. సర్వీస్ సెక్టార్ మరింతగా పెరగాలి. దేశ జీడీపీలో ఏపీ 10 శాతం మేర వ్యవసాయ ఉత్పత్తుల వాటాను కలిగి ఉంది. కొన్ని జిల్లాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ ఉన్నాయి.. వాటికి సంబంధించిన ప్లాంట్లు వస్తే మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంది. జీఎస్డీపీ గ్రోత్ విషయంలో కలెక్టర్లు ఎలా పని చేస్తున్నారనే అంశంపై అధ్యయనం చేస్తాన్నాం. నూతన ఆవిష్కరణలతో అభివృద్ధి ఎలా సాధించాలన్నదానిపై జిల్లా కలెక్టర్లు ఆలోచనలు చేయండి. అన్నమయ్య జిల్లా కలెక్టరే దీనికి ఉదాహరణ. బెస్ట్ పాలసీల అమల్లో కలెక్టర్లు పోటీలు పడాలి. రాష్ట్ర స్థాయిలో కలెక్టర్లకు పోటీ పెట్టినట్టే... జిల్లా స్థాయిలో నియోజకవర్గాల మధ్య పోటీ పెట్టండి. ఫీల్డ్ లెవల్ ఆఫీసర్లకు చాలా అనుభవం ఉంటుంది.. వాళ్ల దగ్గర చాలా సమాచారం ఉంటుంది. క్షేత్ర స్థాయి అధికారులను సమర్ధంగా వినియోగించుకుంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది.. సంక్షేమం చక్కగా అందుతుంది... వినూత్నమైన ఆలోచనలను అమలు చేసేందుకు అవకాశం దక్కుతుంది. సూర్యలంక, మంగినపూడి, విశాఖ, శ్రీకాకుళం, మైపాడు తదితర ప్రాంతాల్లో బీచ్ ఫ్రంట్లు అభివృద్ధి చేస్తే స్థానికులకు అవకాశాలు పెరుగుతాయి. కొత్త జాతీయ రహదారులు కొత్త అవకాశాల్ని సృష్టిస్తాయి... లాజిస్టిక్స్ హబ్ లను ఏర్పాటు చేసుకోవచ్చు... టౌన్ షిప్ లను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. విజన్ యూనిట్లను జిల్లా కలెక్టర్లు సమర్ధంగా వినియోగించుకోవాలి. గతంలో పెద్ద జిల్లాల్లో 21 నియోజకవర్గాలను పర్యవేక్షించాల్సి వచ్చేది. కలెక్టర్లు జిల్లా పర్యటనకు వెళ్తే ప్రయాణానికే ఓ పూట పట్టేది. ఇప్పుడు ప్రతీ జిల్లా కలెక్టర్ పరిధిలో కేవలం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయి. గతంతో పోల్చుకుంటే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. గతానికంటే మెరుగైన పనితీరు కనబర్చడానికి... అభివృద్ధి చేయడానికి, సంక్షేమం అందించడానికి ఇప్పుడు కలెక్టర్లకు అవకాశాలు ఎక్కువ."అని సీఎం వివరించారు.

# ఉంతకల్లులో ఎన్‌టీఆర్ సుజల స్రవంతి నీటి ప్లాంట్ ప్రారంభించిన,కాలవ భారత్



**బొమ్మనహల్ మన జనప్రగతి మే 07:–**బొమ్మనహల్ మండల పరిధిలోని ఉంతకల్లు గ్రామ ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు యువ నాయకుడు కాలవ భారత్ చేతుల మీదుగా ఎన్‌టీఆర్ సుజల స్రవంతి నీటి ప్లాంట్‌ను ప్రారంభించారు,గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ నీటి ప్లాంట్ ప్రారంభం జరిగిందన్నారు,ఈ సందర్భంగా కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సీనియర్ నాయకులు కొత్తపల్లి మల్లికార్జున,ఎమ్మార్పీ మల్లన్న,మరియు నాయకులు అభిమాన కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# వైవీయూ క్యాంపస్ డ్రైవ్‌లో 60 మందికి ఉద్యోగాలు




**కడప మన జనప్రగతి మే 07:–**యోగి వేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ లో 60 మంది విద్యార్థులకు రూ. 3 లక్షల నుంచి రూ. 4.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.మ్యాజిక్‌బస్ ఇండియా కంపెనీ సహకారంతో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌నకు 7 కంపెనీలు (విప్రో, డాక్టర్ రెడ్డీస్, హెటెరో, టీవీఎస్, క్వెస్, ఆల్‌సెట్ ష్నైడర్) విశ్వవిద్యాలయానికి వచ్చాయి. వైవియూలోని పలు డిపార్ట్మెంట్ల నుంచి 105 మంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్ నకు హాజరయ్యారు. ఆయా సంస్థలు వివిధ వడపోత విధానాల ద్వారా విద్యార్థుల జ్ఞాన, నైపుణ్యాలను పరిశీలించి 60 మందిని ఎంపిక చేశారు. క్యాంపస్ డ్రైవ్ కార్యక్రమం విశ్వవిద్యాలయ ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయభారతి ఆధ్వర్యంలో కొనసాగింది. ఇందులో ప్లేస్మెంట్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

# కేసును ఛేదించిన ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు.

**ఇద్దరు దొంగల అరెస్టు..గణపతి విగ్రహం, హుండీ నగదు, రెండు బైకులు స్వాధీనం**

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి మే 07:–**ప్రొద్దుటూరు పట్టణంలోని ఇందిరా కాలనీలో ఉన్న సీతారాముని దేవాలయంలో గత నెల 30వ తేదీ రాత్రి జరిగిన చోరీ ఘటనను ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి గణపతి విగ్రహం, రూ.1,500 హుండీ నగదు, అలాగే రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి, ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూ కృష్ణ ఐపీఎస్ ఆధ్వర్యంలో, రూరల్ సర్కిల్ సీఐ ఎం. నాగభూషణ్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో అనుమానితులైన ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, వారు దేవాలయంలో చోరీ చేసినట్లు



ఒప్పుకున్నారు.నిందితులు దేవాలయ తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి, అల్యూమినియంతో తయారు చేసిన గణపతి విగ్రహాన్ని అపహరించి, దానిని పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.1,500 హుండీ నగదు, పూజా సామాగ్రి మరియు ఇతర వస్తువులను దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు.అరెస్టు చేసిన నిందితులు పిట్టా బాలాజీ (20), సుదారాచార్యుల వీధి, ప్రొద్దుటూరు మరియు షేక్ ఇబ్రహీం కలియుల్లా (20), అమృత నగర్, ప్రొద్దుటూరు. విచారణలో భాగంగా, ఈ ఇద్దరు నిందితులు ఇటీవల చోటుచేసుకున్న మరో రెండు మోటార్ సైకిళ్ల చోరీ కేసుల్లో కూడా ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ కేసులకు సంబంధించిన రెండు బైకులను కూడా వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్నారు.పిట్టా బాలాజీ గతంలో 8 చోరీ కేసుల్లో, షేక్ ఇబ్రహీం కలియుల్లా 3 చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు వారికి 15 రోజుల రిమాండ్ విధించింది. ఈ కేసులపై తదుపరి విచారణ కొనసాగుతోంది.ఈ కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సీఐ ఎం. నాగభూషణ్, ఎస్సైలు కె.సి. రాజు, శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ దాస్, కానిస్టేబుల్ సునీల్ తదితర సిబ్బందిని ఏఎస్పీ విభూ కృష్ణ అభినందించారు.

# నేటి నుంచి ఏపీపీజీసెట్..కే.ఎస్.ఆర్.ఎమ్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రం

**కడప మన జనప్రగతి మే 07:–**ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీపీజీసెట్) ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు కడప నగరంలోని కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుందని యోగి వేమన విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి. లక్ష్మి ప్రసాద్ తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని విద్యార్థుల సౌకర్యార్థం ఆయన పలు వివరాలు వెల్లడించారు.ఈనెల 8వ తేదీన సాయంత్రం 4 గంటలకు సైకాలజీ సబ్జెక్టుతో పరీక్షలుప్రారంభవు తాయన్నారు. 9, 10, 11 తేదీలలో ప్రతిరోజు 3 సెక్షన్లలో ఉదయం 9 గంటలకు మధ్యాహ్నం 12:30 గంటలకు సాయంత్రం 4 గంటలకు పరీక్షలు సబ్జెక్టుల వారిగా ఉంటాయన్నారు. విద్యార్థుల హాల్ టికెట్లలోని సమయాన్ని గమనించి సకాలంలో హాజరుకావాలని సూచించారు.కేఎస్ఆర్ఎం కళాశాల కేంద్రంగా నాలుగు రోజులపాటు జరిగే పరీక్షలకు 859 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.

# జాతీయ స్థాయిలో మార్కాపురం ఖ్యాతి చాటిన వంశీధర్ రెడ్డి

**జెఈఈ మెయిన్స్‌లో 93వ ర్యాంక్ సాధించిన యువ ప్రతిభకు ఘన సన్మానం**

**అన్నా రాంబాబు చేతుల మీదుగా సత్కారం**

**పిఎల్పి యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థి విజయోత్సవ సభ వైభవంగా నిర్వహణ**

**మార్కాపురం మన జనప్రగతి మే 07:–** జెఈఈ మెయిన్స్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 93వ ర్యాంక్ సాధించి,మార్కాపురం ప్రాంత ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటిన, యువ విద్యార్థి ఉప్పులూరి వంశీధర్ రెడ్డికి గురువారం మార్కాపురంలో ఘన సన్మాన సభ నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ (పిఎల్పి) ఆధ్వర్యంలో,జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థి విజయోత్సవ సభగా మారింది. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు చేతుల మీదుగా విద్యార్థిని ఘనంగా సత్కరించడంతో సభలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.మార్కాపురం జిల్లా బేస్తవారిపేట మండలం పందిళ్లపల్లె గ్రామానికి చెందిన ఉప్పులూరి సుధాకర్ రెడ్డి కుమారుడు వంశీధర్ రెడ్డి చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ వచ్చాడు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో జెఈఈ మెయిన్స్ పరీక్షలకు సిద్ధమై దేశవ్యాప్తంగా, 93వ ర్యాంక్ సాధించడం ఇప్పుడు మొత్తం ప్రాంతానికే గర్వకారణంగా మారింది. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో ఇలాంటి అరుదైన ప్రతిభ కనబరచడం పట్ల ప్రజలు, ఉపాధ్యాయులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. వంశీధర్ రెడ్డి సాధించిన విజయాన్ని గుర్తిస్తూ, పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ ప్రత్యేకంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. ప్రతిభను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. విద్య ద్వారా మాత్రమే యువత ఉన్నత స్థాయికి చేరగలదనే సందేశాన్ని ఈ సభలో బలంగా వినిపించింది. మార్కాపురం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, నాయకులు,



అభిమానులు, గ్రామస్తులు హాజరయ్యారు. సభ ప్రాంగణం మొత్తం అభినందనలతో మార్మోగింది. వంశీధర్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు.సభలో పలువురు నాయకులు విద్యార్థి విజయాన్ని కొనియాడుతూ మాట్లాడారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం ఉంటే దేశ స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించగలరని అన్నారు. వంశీధర్ రెడ్డి సాధించిన ర్యాంక్ కేవలం ఒక కుటుంబానికి మాత్రమే కాదు మొత్తం ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించి దేశానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. చదువుపై దృష్టి పెట్టి కష్టపడి ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్నా రాంబాబు సూచించారు. గ్రామీణ యువత ఆత్మవిశ్వాసంతో పోటీ పరీక్షలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. వంశీధర్ రెడ్డి విజయం మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. అలాగే విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో ఘన సన్మాన సభ నిర్వహించిన పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్‌ను అన్నా రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు. యువతలో విద్యాపట్ల చైతన్యం తీసుకురావడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతిభను గౌరవించడం ద్వారా సమాజం ముందుకు సాగుతుందని తెలిపారు. పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ప్రతిభలు ఉన్నప్పటికీ సరైన అవకాశాలు, ప్రోత్సాహం లేక చాలామంది వెనుకబడుతున్నారని అన్నారు. అలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఈ సన్మాన సభ నిర్వహించామని



చెప్పారు. వంశీధర్ రెడ్డి సాధించిన విజయం యువతకు దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలని పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో సత్తా చాటగలరని వంశీధర్ రెడ్డి నిరూపించాడన్నారు. భవిష్యత్తులో కూడా విద్యా రంగంలో ప్రతిభ కనబరిచే యువతకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ అన్నా రాంబాబు, పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్,నాయకులు పాల్గొన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ తమ కుమారుడు సాధించిన విజయం పందిళ్లపల్లె గ్రామానికే గౌరవం తీసుకువచ్చిందన్నారు. తమ కుమారుడిని ఆశీర్వదించిన నాయకులు, ఉపాధ్యాయులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మొత్తం కార్యక్రమం విద్యార్థి విజయోత్సాహంతో సందడిగా సాగింది. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో వెలుగొందిన వంశీధర్ రెడ్డి పేరు ఇప్పుడు ప్రాంతవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. జెఈఈ మెయిన్స్‌లో సాధించిన ఈ అరుదైన ర్యాంక్‌తో మార్కాపురం ప్రాంత యువతలో కొత్త ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. వంశీధర్ రెడ్డి విజయం మరెందరో విద్యార్థులకు ప్రేరణగా మారుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. విద్య, పట్టుదల, కృషి ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా జాతీయ స్థాయిలో చరిత్ర సృష్టించవచ్చని ఈ విజయం మరోసారి నిరూపించింది.

# అంబకపల్లిలో విజిబుల్ పోలీసింగ్



**లింగాల మన జనప్రగతి మే 07:–**పోలీస్ జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపిఎస్ ఆదేశాల మేరకు లింగాల పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబకపల్లి గ్రామంలో గురువారం రాత్రి విజిబుల్ పోలీసింగ్, కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా లింగాల ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి గ్రామస్తులతో నేరుగా మాట్లాడి, చోరీలను నివారించే చర్యలు, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల భద్రత, డయల్ 112 సేవలు, సైబర్ క్రైమ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.గ్రామంలో పోలీసుల ప్రత్యక్ష హాజరు వల్ల ప్రజల్లో భద్రతా భావం పెరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబకపల్లి గ్రామస్థులు, లింగాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174